# మార్గదర్శి



## కీ॥శే॥ శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారి
## జీవిత చరిత్ర

**1926 - 1975**

శ్రీ

# ముందుమాట

ఒక సామాన్య కుటుంబంలో జన్మించి,

అత్యున్నత శిఖరాలు అధిరోహించిన మహనీయుడు,

బాల్యంలోనే అనేక ఒడిదుడుకులు, కష్టాలను ఎదుర్కొన్నాడు.

చిన్నప్పుడే స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ లక్ష్యం చేరుకోవాలని

కలలు కన్నాడు.  నిరంతరం కఠోర సాధనతో అనుకున్న

లక్ష్యాన్ని చేరుకుని తన కీర్తిని నలుమూలలా వ్యాపింపజేసి

అందరి మన్ననలు అందుకున్న ఆ మహానుభావుడు

అందరికి ప్రీతి పాత్రుడు.  ఆయన జీవితమే నవతరానికి ప్రేరణ.

ఆ మహనీయుడిని మార్గదర్శకంగా తీసుకోవాలనే ఆకాంక్ష ఈ తరం

వారిలో కలుగుతుందని, వారు తమ జీవితానికి లక్ష్యాన్ని

నిర్దేశించుకుంటారని, వారి జీవిత విశేషాలు, జయాపజయాలు

ఒక పుస్తక రూపంలోకి తెచ్చి నవతరాలకు

అందించడమే ప్రధాన ఉద్దేశ్యం.

# పరిచయం

గుర్రం వారి వంశోద్ధారకుడు, మా మార్గదర్శి,

మా తండ్రిగారైన శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారి రక్తంతో పాటు

వారి విలువలను పంచుకున్న వారిలో ఒకరిగా,

వారి జీవిత విశేషాలకు అక్షర రూపం ఇచ్చి పుస్తకం ద్వారా

మా భావితరాలకు అందించుటకు సంకల్పసిద్ధిని

ఆ భగవంతుడు నాకు ప్రసాదించినందుకు

సర్వదా నేను కృతజ్ఞుడను.

- గుర్రం నరసింహ్వారావు

01-03-2022

# కృతజ్ఞతలు

నాకు మా నాన్నగారి జీవిత విశేషాలకు

పుస్తక రూపాన్నిచ్చే సంకల్పాన్ని కల్పించిన మా ఫ్యామిలీ కన్సల్టెంట్

శ్రీ కృష్ణన్ గారికి, వ్రాయమని ప్రోత్సహించి, మార్పులు చేర్పులు

తెలియజేసిన సోదరుడు శ్రీ ఉమా మహేశ్వరరావు కు

నేను వ్రాసిన దానిని సరళంగా వ్రాసి మెరుగులు దిద్దించిన

మా గుర్రం బ్రదర్స్ ఉద్యోగి

శ్రీ మురారి గారికి, అవసరమైన ఫోటోలు సేకరించి ప్రింటింగ్ పనులు

చూసిన సోదరుల కుమారులు చి॥ అంకిత్‌కు, సుమన్ కుమార్ లకు

ప్రెస్ వారికి మరియు సహకరించిన

కుటుంబ సభ్యులందరికి.

# SV MALLESWARA SASTRY GARI SANDESAM

***Dear Rao Garu,***

The book is wonderfully written. I was amazed by the detail and meticulosity- not missing even an iota of essential facts and descriptions. Now I got the required details about your family and business. Yours is an excellent family and ideal for introducing the governance for perpetuity.

Hats off to NARASIMHA RAO Garu, – the book is written as if it is written by a professional writer.

I finished the book in one sitting at a stretch. It is so absorbing and hard to put down. What I gather from the book is your family is shaped by the values of your father which I summarise below-

1. Hard work- how he came up by self-effort and fighting adversaries
2. Entrepreneurship-he worked as an employee but charted independent business
3. Honesty and integrity- many instances
4. The system is driven and professional approach- always focussed on accountability, responsibility, and result orientation
5. Customer care and orientation- several anecdotes
6. Amiability and avoidance of altercations and arguments even if it is justified
7. Business acumen- wealth creation
8. TRUST AND TRUSTWORTHINESS
9. Patience
10. Close relationships with customers, co traders, public in general.
11. Altruism
12. Patriotic fervor
13. Taking care of employees like family members
14. Engaging external professionals for audit, tax purposes
15. Ethical conduct in all dealings
16. Caring for the family – spending time and taking to places, giving the good style of living
17. Anticipation – adapting to changes learning from experience
18. An example of how to pass on the legacy- by training successors and imparting values.

I shall be glad if you and other family members reflect on this and see what are the core values and vision that you can draw from the founder.

# సందేశం



శ్రీ గుర్రం ఉమామహేశ్వరరావు

చిన్నన్న (గుర్రం నరసింహేశ్వరావు) మంచి చదువరి, గొప్ప పఠనాశక్తి గలవారు. ఆయన వద్ద కొన్ని వందల సంఖ్యలో పుస్తకాలు వున్నాయి. నిత్యం మరియు విరామ సమయములో అయినా ఏదో ఒక పుస్తకం చదువుతూనే వుంటారు. "కుటుంబ రాజ్యాంగం" వ్రాసుకోవడానికి మేము కౌన్సిలర్ "శ్రీ కృష్ణన్" గారిని ఎంచుకొని వారితో సంప్రదింపులు జరుపుతున్నప్పుడు, యిప్పటి తరం వారికి ముందు తరాల వారికి ఈ కుటుంబము ఎలా మొదలైంది, ఏ విలువలతో ప్రయాణిస్తుంది, కుటుంబములో ఐకమత్యానికి పాటించిన నియమాలు, నియంత్రణలు ఏమిటి, అవి కుటుంబ ఉన్నతికి, వ్యాపారాభివృద్ధికి ఎలా తోడ్పడ్డాయి, ఎటువంటి ఒడుదుడుకులను, కష్ట నష్టాలను తట్టుకొని కొనసాగింది అనే విషయాన్ని తప్పక గ్రంధస్థం చేయాలి అన్న వారి సూచనతో చిన్నన్నను, ఆ రచన చేయమని అడిగాను.

అన్న వ్రాసిన వ్రాతప్రతిని చూడమని పంపారు. అది చదువుతూ నేను ఆశ్చర్యపోయాను. కారణం చేయి తిరిగిన రచయిత వ్రాసినట్లు వుంది కాని, మొదటిసారి వ్రాసినట్లు లేదు. ఇది మా కథ కావడంతో చాలా సంఘటనలు నా ఎరుకలోనే జరిగాయి. గతాన్ని కళ్ళకు కట్టినట్లు మరొక్కసారి అన్న నా ముందు జరుగుతున్న అనుభూతి కల్పించింది అన్నయ్య ఈ రచన.

చదువుతున్నంత సేపు నేను పూర్తిగా రచనలో లీనమై ఆత్మానుభూతిని పొందాను. కొన్ని సందర్భాలను చదువుతున్నప్పుడు కళ్ళు చెమర్చాయి. గుర్రం వెంకటేశ్వర్లు గారికి జన్మించిన సంతానం మరియు వారి సంతానం ఇలా ఈ

వంశవృక్షంలో వచ్చిన, రాబోయే వారందరికి ఈ రచన ఒక కరదీపిక అవుతుంది.

తన మూలాలను తెలుసుకొని వాటిలోని మంచిని గ్రహించి అనుభవాలను అర్థం చేసుకొని తమ జీవితాలను మలచుకొని కుటుంబానికి, సమాజానికి మంచి చేస్తూ జీవించడంలో ఎంత తృప్తి ఉంటుందో తెలిపే ఒక సాధారణ వ్యక్తి యొక్క అసాధారణ కథ యిది.

సాధారణంగా జీవించడం అంత సామాన్యమైన విషయం కాదు. ఆశ, మోహం, అసూయ, ద్వేషం అనే వాటిని దరిచేరనీయకుండ ఉన్నంతలో తృప్తిగా జీవిస్తూ, తను, తన చుట్టు ఉన్నవారంతా ఉన్నతముగా జీవించాలి అనే నియమంతో జీవితం మొత్తం కృషిచేసి, జీవించింది కొద్దికాలమే అయిన వారు స్వర్గస్థులై సుమారు అర్ధ శతకం అవుతున్నా చెప్పకుండా ఆయన ఆచరించి చూపిన మార్గమే ఈరోజుకు "గుర్రం వెంకటేశ్వర్లు" గారి కుటుంబ పరంపరకు మార్గ నిర్దేశాన్ని, మార్గాన్ని చూపించింది మరిన్ని తరాలకు చూపిస్తుంది.

కుటుంబములోని ప్రతి ఒక్కరు, కుటుంబములోకి రాబోయే భవిష్యత్తు తరాలవాళ్ళు మా కుటుంబముతో అనుబంధం, స్నేహం వున్న బంధుమిత్రులు ఒక సాధారణ వ్యక్తి జీవిత కధ చదివి ప్రేరణ పొందాలి అనుకునే యువకులు అందరు ఈ చిన్ని పోత్తమును తప్పక చదివి, వారు ఉత్తమము అనుకున్న వాటిని వారి, వారి జీవితాలలో ఆచరించి, వారి కుటుంబాలకు, సమాజానికి ఉపయుక్తమైన వారిగా జీవించడంలో ఈ పుస్తకం తప్పక దోహదము చేస్తుంది అని ఆశిస్తూ. మరొక్కసారి చిన్నన్నను యింతటి విలువ కట్టలేని ఆస్తిని మా అందరికి అందజేసినందులకు మా కుటుంబ సభ్యుల అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఇట్లు
గుర్రం ఉమామహేశ్వరరావు

# అభిప్రాయం



శ్రీమతి గుర్రం వీరలక్ష్మి

శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారికి నేను పెద్ద కోడలిని.

నా పూర్వజన్మ పుణ్యఫలంగా భగవంతుని కృపతో నేను శ్రీ వెంకటేశ్వర్లు గారింటికి పెద్దకోడలుగా వచ్చాను. మామయ్య గారి జీవిత చరిత్రప్రతిని చూసి నాకు చాలా సంతోషం కలిగింది. మామయ్య గారి మంచితనం, దయాగుణాన్ని మా మరిది నరసింహ్వారావు తక్కువే వ్రాసాడేమో అనిపించింది. తన బిడ్డలందరిని క్రమశిక్షణతో, విలువలతో పెంచారు.

నేను 14 సం॥రాల చిన్న వయస్సులో వారింటికి పెద్దకోడలిగా వచ్చినందున ఎలా మెలగాలో అని భయపడ్డాను. వారు నన్ను సొంత కూతురిలా చూసుకున్నారు. నన్ను నా మొదటి కాన్పు సమయంలో నన్ను మా తల్లి గారింటికి పంపకుండా ఇక్కడే పురుడు పోయించి, మొదటిసారి ఆడపిల్ల పుట్టిందని బంగారు గాజులు చేయించి ఘనంగా బారసాల జరిపించారు. మనవరాలిని తన పక్కలోనే పడుకోబెట్టుకుని నిద్రపుచ్చేవారు.

ఒకసారి నాకు నోటిలో కురుపు అయి పై అంగిలి మొత్తం తీసి దాని స్థానంలో ఆపరేషన్ ద్వారా కృత్రిమ అంగిలి అమర్చినపుడు హైదరాబాద్ హాస్పిటల్‌లో 20 రోజులపాటు అక్కడే ఉండి కంటికి రెప్పలా చూసుకున్నారు.

వ్యాపారాన్ని అభివృద్ధి పరుస్తున్న సమయంలో, తక్కువ వయస్సులోనే స్వర్గస్తులై మమ్ములందరిని శోకసంద్రంలో ముంచివెళ్ళారు. మళ్ళీ జన్మంటూ ఉంటే మరలా ఈ కుటుంబంలోనే ఒకరిగా పుట్టాలని కోరుకుంటున్నాను.

# అభిప్రాయం



శ్రీమతి గుర్రం లక్ష్మి

శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారికి నేను రెండవ కోడలిని.

వారి కుమారుడు నరసింహ్వారావుగారితో మా వివాహం నిశ్చయం అయిన తర్వాత లగ్నపత్రిక వ్రాసుకోవడానికి మా ఊరు బయలుదేరినపుడు కుండపోతగా వర్షం. మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం కారణంగా మా ఊరికి రావడానికి దారులన్ని నీట మునిగాయి. మా గ్రామానికి చేరుకోలేక మధ్యలోనే వెనుదిరగవలసి వచ్చింది. దానిని వారు విఘ్నంగా భావించక పెద్దమనసుతో తర్వాత వచ్చి లగ్నాలు పెట్టుకుని మా వివాహం జరిపించారు. వారింటికి కోడలిగా వెళ్ళడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

వారు మమ్ములను కోడళ్ళుగా కాక కూతుళ్ళుగా భావించేవారు. సాధారణంగా ఎవరైనా పుట్టింటికి వెళ్ళాలంటే సంతోషపడతారు. మేము అత్తవారింటిని వదిలి వెళ్ళాలంటే ఎంతో కష్టంగా వెళ్ళి వీలైనంత త్వరగా తిరిగి వచ్చేవారము. మా పురుళ్ళన్నీ అత్తవారింట్లోనే జరిగాయి. గర్భవతులుగా ఉన్నప్పుడు మమ్ములను ఎంతో అపురూపంగా చూసుకున్నారు. ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించేవారు. మా పెద్దకుమారుడు ఏడవ నెలలో తక్కువ బరువుతో జన్మిస్తే వారు ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. నన్ను "అమ్మాయ్ లక్ష్మీ" అని ప్రేమగా పిలిచేవారు. వారి ముఖంలో కోపాన్ని మేము ఎప్పుడూ చూడలేదు. నవ్వుతూ ఉండేవారు.

మామయ్య గారిని అందరూ ఇష్టపడేవారు. ఇంతమంది అభిమానం ఎలా పొందారా అని ఆశ్చర్యం కలిగేది. ఎప్పుడూ ఇతరుల మంచిని కోరుతూ, ఎవరికి హాని తలపెట్టేవారు కారు. దేవుడి లాంటి మామయ్య గారితో నాకు కేవలం 5సం॥ల ప్రేమానుబంధం మాత్రమే ఉన్నది. వారి చరిత్రను ఇలా పుస్తక రూపంలోకి తీసుకురావడం నాకు చాలా సంతోషాన్నిస్తుంది.

# అభిప్రాయం



శ్రీమతి గుర్రం సుమతి

శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారికి నేను 3వ కోడలిని.

నేను శ్రీ వెంకటేశ్వర్లు గారికి 3వ కోడలిని. మా వివాహం, ఆడపడుచు పద్మావతి దేవి వివాహం ఒక్కసారే జరిగేలా ఏర్పాట్లు జరిగాయి.
కాని, మా ఆడపడుచు వాళ్ళ అత్తగారింట్లో వరుడి నాయనమ్మ చనిపోవడం వలన వారి పెళ్ళి వాయిదాపడినది. ఆ సమయంలో మా వివాహం కూడా ఆగిపోతుందేమోనని మా పుట్టింటివారు భయపడ్డారు. ఆ సమయంలో మా మామయ్య గారు కూతురి పెళ్ళి వాయిదా పడిందన్న బాధలో ఉన్నా పెద్దమనసు చేసుకుని మా వివాహం జరిపించారు. మామయ్య గారి గొప్ప మనసుకు ఇదో ఉదాహరణ.

మామయ్య గారి జీవిత చరిత్ర ప్రతిని చూసి నాకు చాలా సంతోషం కలిగింది. ఆ భగవంతుడు నాకు ఇంతటి మహానుభావునికి కోడలుగా కలిసి జీవించే భాగ్యాన్ని ఒక సంవత్సర కాలం మాత్రమే ప్రసాదించాడు. మామయ్యగారు పరమపదించే నాటికి నేను గర్భవతిని. నాకు తొలి సంతానం కలిగినపుడు మామయ్యగారు జీవించి ఉంటే బాగు అనిపించింది. మామయ్య గారు నేర్పిన విలువలతో పెరిగిన కుటుంబంలో నేనూ ఉన్నందుకు ఎంతో తృప్తి చెందుతున్నాను.

# అభిప్రాయం



శ్రీమతి గుర్రం శశికళ

మీరిచ్చిన ఈ పుస్తకాన్ని రాత్రి మేము సినిమా చూడకుండా కొంత భాగం నేను, కొంత భాగం మా వారు ఒకరికొకరం చదివి వినిపించుకున్నాము.

చాలా అద్భుతంగా ఉంది.  ఒళ్ళంతా పులకరించిపోయింది.

కొంత సమయం నోట మాట రాలేదు.

మామయ్య గారి కష్టం వెనుక ఇంత చరిత్ర ఉందా అని అనిపించింది.

అంత గొప్ప మహానుభావునికి కోడలు కావడం

నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను.

# అంకితం

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు
కీ॥శే॥ శ్రీమతి లీలావతి - శ్రీ వెంకటేశ్వర్లు గారి
పాదాలకు వినమ్రపూర్వకంగా
నివాళులు అర్పిస్తూ అంకితమిస్తున్నాను.

# దివ్య స్మృత్యంజలి



## కీ॥శే॥ శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారు

**1926 - 1975**

జాతస్య హిధ్రువో మృత్యు: ధ్రువం జన్మ మృత స్యచ!
తస్మాద పరిహార్యే ర్ధేనత్వం శోచితు మర్హసి!

పుట్టిన ప్రతి వానికి మరణం తప్పదు.
మరణించిన వానికి పున:ర్జన్మ తప్పదు.
కనుక తప్పని సరియైన ఈ విషయములయందు నీవు శోకింపదగదు.

# విషయ సూచిక

1. బాల్యం
2. ఖమ్మం రాక
3. అక్క గారి కుటుంబ బాధ్యతల స్వీకరణ
4. ఉద్యోగాన్వేషణ
5. పడుట లేచుట కొరకే
6. అంతర్వాణి
7. వివేకవంతమైన ఆలోచనలు జీవితాలను ప్రభావితం చేస్తాయి
8. అందివచ్చిన అవకాశం
9. బాధ్యతల విభజన
10. వ్యాపారాభివృద్ధి
11. ఆదిలోనే చుక్కెదురు
12. నూతన బ్రాంచి ఏర్పాటు
13. మకాం మార్పు
14. మార్పులను ఆస్వాదించడం
15. భాగస్తులపై నమ్మకం
16. మరో బ్రాంచి ఏర్పాటుకు నిర్మాణం
17. భాగస్తులతో వ్యాపార విభజన
18. దస్త్ర పూజ
19. ఖరీదు విధానం
20. ప్రత్యేక నాణ్యమైన వస్త్రాలు
21. చిన్న వ్యాపారులను ప్రోత్సహించేవారు
22. ఖాతాల నిర్వహణ
23. చెల్లింపు విధానం
24. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

25. కష్టమర్లతో సన్నిహిత సంబంధాలు
26. మార్కెటింగ్ వ్యూహాలు
27. సప్లయిదారులతో సత్సంబంధాలు
28. ఎల్లలు దాటిన అభిమానం
29. వ్యాపార నిర్వహణలో ఉద్యోగుల పాత్ర
30. సామాజిక కార్యకలాపాలు
31. మానవతా మూర్తి
32. పరుల సొమ్ము పాము వంటిది
33. వివాద రహితుడు
34. దిన చర్య
35. దైవ భక్తి
36. అయిన వారితో అనుబంధాలు
37. విహార యాత్రలు
38. జీవితం నేర్పిన పాఠాలు
39. కుటుంబం
40. కుటుంబ సభ్యుల బాగోగులు
41. మనవలు, మనవారలంటే ప్రేమ
42. సహధర్మచారిణి
43. ఆఖరి అంకం
44. చివరి మజిలి
45. నాన్నగారితో నేను
46. స్ఫూర్తి
47. ముగింపు
48. ఆ తర్వాత
49. శాఖల విస్తరణ
50. వంశ వృక్షకం
51. కలిసి ఉంటే కలదు సుఖం
52. భావి తరాల వారికి విన్నపం
53. పరి సమాప్తి

# బాల్యం

పల్లెలు సౌందర్య నిలయాలు, శాంతి సౌభాగ్యాలకు ఆలయాలు, ప్రేమానురాగాల కోవెలలు. సరిగ్గా అలాంటి పల్లెటూరు చంద్రుపట్ల గ్రామం.

అతి సామాన్య వైశ్య కుటుంబములో జన్మించాడతను. నీతి నిజాయితీలకు కట్టుబడి జీవితం గడిపాడతను. నిస్వార్థ జీవికి నిఖార్సయిన చిరునామాగా నిలిచాడు. నాయకుడిగా, భావి తరాలకు మార్గదర్శకునిగా చిరస్మరణీయుడు శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారు.

ఖమ్మం జిల్లా, కల్లూరు మండలం, చంద్రుపట్ల గ్రామంలో 1926వ సంవత్సరం సెప్టెంబరు 20వ తేదీన పుణ్యదంపతులు శ్రీ గుర్రం కోటయ్య - వెంకమ్మ గార్లకు మూడవ కుమారుడిగా శ్రీ వెంకటేశ్వర్లు గారు జన్మించారు.

భుజాలపై ఎత్తుకుని, వేలుపట్టి నడిపించే తండ్రి తనకు ఊహ తెలియక ముందే ఈ లోకాన్ని వదిలి వెళ్ళారు. నాన్న గారిది చిన్నతనం అయినందువల్ల కుటుంబ భారమంతా తన ఇద్దరు అన్నయ్యలు శ్రీ గుర్రం శ్రీరాములు గారు, శ్రీ గుర్రం కాంతయ్య గారిపైనే పడింది. వీరు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. వారి కుటుంబ పరిస్థితుల ప్రభావం వలన నాన్నగారిని 4వ తరగతి వరకు మాత్రమే చదివించగలిగారు. ఆ తర్వాత వ్యవసాయ పనులలో వారిని చేదోడు వాదోడుగా ఉంచారు.

అలా నాన్నగారు చదువు మానేసి సుమారు 7 సంవత్సరాల కాలం పాటు వ్యవసాయ పనులలో తన అన్నయ్యలకు సహాయకుడిగా ఉన్నారు. ఆర్థిక పరిస్థితి అంతగా లేనందున చాలా సాధారణ జీవితం గడిపారు.

# ఖమ్మం రాక

నాన్న గారికి వరసకి అక్కగారైన శ్రీమతి గుడిపాటి రామకోటమ్మ గారు ఉండేవారు. వీరికి భర్తతో పాటు ఒక కూతురు, విధవరాళ్ళయిన ఇద్దరు ఆడపడుచులు కుటుంబ సభ్యులుగా ఉండేవారు. కొంతకాలం తర్వాత శ్రీమతి రామకోటమ్మ గారి భర్త శ్రీ రామకోటయ్య గారు చనిపోయాక మొత్తం వారి కుటుంబం మగదిక్కులేని సంసారంగా ఉండేది.

అలాంటి క్లిష్ట పరిస్థితిలో శ్రీమతి రామకోటమ్మ గారు ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ సమయంలో వారు చంద్రుపట్ల గ్రామానికి బయలుదేరి మా నాయనమ్మ శ్రీమతి గుర్రం వెంకమ్మ గారిని మరియు వారి కుటుంబ సభ్యులను సంప్రదించి మగదిక్కులేని మా కుటుంబానికి చిన్న తమ్ముడు వెంకటేశ్వర్లు తోడు కోరుతూ ఖమ్మం పంపమని వారిని కోరారు.

అంతేగాక తన ఒక్కగానొక్క కూతురు లీలావతిని వారికిచ్చి వివాహం జరిపిస్తానని కోరగా కుటుంబసభ్యులందరూ దానికి సమ్మతించి నాన్నగారిని ఇల్లరికపు అల్లుడిగా శ్రీమతి రామకోటమ్మ గారింటికి పంపించుటకు సిద్ధమయ్యారు.

అలా నాన్నగారు 1942 సంవత్సరంలో ఇల్లు, వాకిలి వదిలి, బంధాలను దూరం చేసుకుని వట్టి చేతులతో ఖమ్మం వచ్చారు.

# అక్కగారి కుటుంబ బాధ్యతల స్వీకరణ

నాన్నగారు ఖమ్మం వచ్చేనాటికి నిజాంపేట బజారు నందు శ్రీమతి రామకోటమ్మ గారికి ఇంటి ముందు చిన్న కిరాణం షాపు ఉండేది. దానికి తోడు కిరోసిన్ కూడా అమ్ముకుని జీవించేవారు. వారికి పశువులు కూడా ఉండేవి.

వాటికి కావలసిన పశుగ్రాసం కొరకు పంట పొలాలకు వెళ్ళి కోసుకొచ్చేవారు. నాన్నగారు వెళ్ళిన తర్వాత వాటి నిర్వహణ బాధ్యతలు తాను తీసుకున్నారు.

అప్పట్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. శ్రీమతి రామకోటమ్మ గారి ఏకైక కుమార్తె లీలావతిని 8 సంవత్సరాల వయస్సులో నాన్నగారికిచ్చి వివాహం జరిపించారు. ఆ తర్వాత కుటుంబ బాధ్యతలతోపాటు పోషణ బాధ్యతలు కూడా నాన్నగారు తీసుకున్నారు.

అతి కొద్ది కాలంలోనే ఆ ప్రాంతవాసులకు దగ్గరయ్యారు. ప్రతి ఒక్కరిని పేరు పేరునా వరసలు కలుపుతూ పలకరించేవారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ముస్లిం మతస్తులు నివసించేవారు. అది రజాకార్ల ఉద్యమం జోరుగా నడిచే సమయం. హిందువులకు, ముస్లింలకు మత ఘర్షణలు బాగా జరిగేవి. ఒకసారి అలా ఘర్షణలు జరిగిన సమయంలో కొంతమంది ముస్లింలను తన ఇంటిలో దాచిపెట్టి వారికి ఆశ్రయం ఇచ్చారు. ఈ సంఘటన ఆ ప్రాంత వాసులకు మరింత చేరువయ్యేలా చేసింది.



శ్రీ & శ్రీమతి గుర్రం వెంకటేశ్వర్లు-లీలావతి
దంపతులు

# ఉద్యోగాన్వేషణ

కుటుంబంలో సంపాదించేవారు ఒక్కరే అయి, అందరిని పోషించడానికి సరిపడా ఆదాయం రాక నాన్నగారు ఆలోచనలో పడ్డారు. ఇంట్లో కిరాణం షాపు మీరు నిర్వహించుకోండి, నేను ఏదైనా ఉద్యోగంలో చేరుతానని తన నిర్ణయాన్ని వారి ముందు ఉంచి ఉద్యోగాన్వేషణ సాగించారు.

అలా కమాన్‌బజార్‌లో ఉన్నటువంటి ప్రముఖ కమీషన్ వర్తకులు శ్రీ "చెరుకూరి ముత్తయ్య" గారి వద్ద గుమస్తాగా నెలకు 70/- రూపాయల జీతంతో పనిచేయుటకు కుదిరారు. అలా నాన్నగారి జీవన పయనంలో ఒక కొత్త అధ్యాయానికి బాటలు వేసుకున్నారు. రోజూ ఇంటి నుండి కమాన్‌బజార్ వరకు సైకిల్‌పై వచ్చి విధులు నిర్వహించేవారు.

చిన్నతనం నుంచే మంచి నడవడిక, కష్టపడే తత్వం అలవర్చుకున్న నాన్నగారికి తన యజమాని శ్రీ చెరుకూరి ముత్తయ్య గారి వద్ద మంచిపేరు తెచ్చుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు. వారు చెప్పిన అన్ని పనులు సకాలంలో పూర్తిచేస్తూ అనతికాలంలోనే వారి మన్ననలు పొందారు.

# పడుట లేచుట కొరకే

శ్రీ చెరుకూరి ముత్తయ్య గారి వద్ద వ్యాపార ఓనమాలు దిద్దుకుని మెలకువలు తెలుసుకుని, వారి వద్ద మంచి నమ్మకస్తునిగా పేరు గావించారు. నాన్నగారి మంచితనాన్ని గమనించిన శ్రీ ముత్తయ్య గారు తన సోదరుని కుమారుడైన శ్రీ చెరుకూరి చిన్న వీరయ్య గారితో భాగస్వామ్యాన్ని ఏర్పాటుచేసి బియ్యం వ్యాపారాన్ని ప్రారంభింపజేశారు.

అలా ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే వారు 3000/- రూపాయల నష్టాన్ని చవిచూశారు. ఆ నష్టాన్ని నాన్నగారు తన వాటాగా 1500/- రూపాయలను శ్రీ ముత్తయ్య గారికి ప్రామిసరీ నోటు వ్రాసి ఇచ్చి బియ్యం వ్యాపారం నుండి వైదొలిగారు. అలా మొదటి అపజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.

ఆ తర్వాత స్నేహితుడు శ్రీ గుడ్ల వీర రాఘవులు గారితో కలిసి సొంతంగా బియ్యం వ్యాపారాన్ని ప్రారంభించారు. అనతి కాలంలోనే వీరిరువురి భాగస్వామ్యం లాభాలవైపు పయనించింది. అంతేగాక ఇరువురి ఆలోచనలు ఒకేలా ఉండడంతో భవిష్యత్ కార్యాచరణకు ఆలోచనలు మొదలు పెట్టారు. అంతేగాక నాన్నగారు శ్రీ చెరుకూరి ముత్తయ్య గారికి ఇవ్వవలసిన బాకీ మొత్తాన్ని తీర్చివేశారు.

# అంతర్వాణి

మన ఆలోచనలు మనం ఉచ్చరించే మాటల ద్వారా వ్యక్తం చేస్తాయని అందరికి తెలుసు.  కాని మన లోపల నుండి మాట్లాడుతూ, మనకు మార్గదర్శనం చేసే మరొక అంతర్వాణి మనలో ఉంది. ఈ అంతర్వాణి మన ఆలోచనలకు సాక్షిగా ఉంటుంది.

మన అంతర్వాణి యొక్క సందేశాన్ని ఉల్లంఘించి దానికి వ్యతిరేకంగా పనిచేసిన పరిస్థితుల్లో అంతర్వాణి ప్రబోధం ఆగిపోక మళ్ళీ, మళ్ళీ మనల్ని హెచ్చరిస్తుంది. మనం చేసిన తప్పలను దిద్దుకుని సవ్య మార్గంలో ముందుకు సాగేందుకు సహాయపడుతుంది.


1950

# వివేకవంతమైన ఆలోచనలు జీవితాలను ప్రభావితం చేస్తాయి

అది 1950వ సంవత్సరం. నాన్నగారి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ సంవత్సరం. ప్రత్యక్షంగా, పరోక్షంగా భవిష్యత్తులో కొన్ని వేల కుటుంబాల సుఖ సంతోషాలకు కారణమవుతుందని ఊహించని సంవత్సరం.

నాన్నగారు మరియు వారి భాగస్వామి శ్రీ గుడ్ల వీర రాఘవులు గారి మది నుండి ఓ అద్భుతమైన ఆలోచన ఉదయించింది. అదే మన ఇద్దరి భాగస్వామ్యంతో ఒక వస్త్ర వ్యాపారాన్నిప్రారంభిద్దామని.

ఇద్దరూ సమాలోచనలు చేశారు. సమానంగా పెట్టుబడి పెడదాం, లాభాన్ని సమానంగా పంచుకుందామని నిర్ణయించుకున్నారు. నాన్నగారి వాటాగా 15000/- రూపాయలను సమకూర్చారు. అలాగే భాగస్వామి శ్రీ వీర రాఘవులు గారు కూడా. కాని వారి మదిలో ఇంకా ప్రశ్నలేవో తలెత్తుతున్నాయి.
అధనంగా కావలసిన పెట్టుబడి, మార్కెట్‌లో ఉన్న పోటీదారులు,
అనుభవలేమి, వాటిని దాటుకొని వ్యాపారాన్ని ప్రారంభించడమెలా అని?

# అంది వచ్చిన అవకాశం

ఖమ్మం కమాన్‌బజార్ రైల్వేగేటు వద్ద అప్పటికే కొంత కాలంగా నిర్వహించబడుచున్న వస్త్ర దుకాణాలు రెండు ఉండేవి. ఒకటి శ్రీ గడ్డం వెంకయ్య గారి బట్టల దుకాణం, రెండవది శ్రీ గడ్డం చంద్రయ్య గారి బట్టల దుకాణం.

శ్రీ గడ్డం వెంకయ్య గారు నాన్నగారి భాగస్వామి అయిన శ్రీ గుడ్ల వీర రాఘవులు గారి సొంత మామగారు. వ్యాపార నిర్వహణా సామర్ధ్యం అంతగా లేని శ్రీ గడ్డం వెంకయ్య గారు తన అల్లుడు శ్రీ వీర రాఘవులు గారిని పిలిపించి, నేను వ్యాపారం నిర్వహించలేక పోవుచున్నాను. ఇదే షాపులో నీవు వ్యాపారాన్ని నిర్వహించుకోమని వారిని కోరగా వారు సరేనని తన నిర్ణయాన్ని తెలియజేశారు. దీనిని అవకాశంగా మలచుకుని వీరిరువురు కలిసి వ్యాపారాన్ని ప్రారంభిద్దామనుకున్నారు. వస్త్ర వ్యాపారానుభవలేమి కారణంగా శ్రీ గడ్డం చంద్రయ్య గారి వస్త్ర దుకాణంలో విధులు నిర్వహిస్తున్న శ్రీ బెందడి లింగం గారిని వర్కింగ్ పార్టనర్‌గా కలుపుకుని వస్త్ర దుకాణం ప్రారంభించుటకు ముగ్గురూ భాగస్వాములయ్యారు.

కమాన్‌బజార్ రైల్వేగేటు వద్ద శ్రీ హనుమాన్ దేవాలయ ట్రస్టీ అయిన శ్రీ పండిత భీం ప్రసాద్ మిశ్రా గారి వద్ద నెలకు 50/- రూపాయల అద్దెతో ఆ షాపుని తీసుకుని శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారు (నాన్నగారు) - ఆరున్నర అణాలు, శ్రీ గుడ్ల వీర రాఘవులు గారు - ఆరు అణాలు, శ్రీ బెందడి లింగం గారు - మూడున్నర అణాల వాటా చొప్పన మొత్తం 30000/- రూపాయల పెట్టుబడితో "గుర్రం వెంకటేశ్వర్లు & కో" పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించారు.



శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారు

శ్రీ గుడ్ల వీర రాఘవులు గారు

శ్రీ బెందడి లింగం గారు




గుర్రం వెంకటేశ్వర్లు & కో

# బాధ్యతల విభజన

కార్య నిర్వహణలో బాధ్యతల విభజన అనేది సముచితమైన పాత్ర పోషిస్తుంది. ఈ బాధ్యతల విభజన ఆవశ్యకతను తోటి భాగస్వాములకు విశదీకరించారు నాన్నగారు. వస్త్రాలను ఖరీదు చేయడం, వాటి ధరలను నిర్ణయించడం, వ్యాపార నిర్వహణ, పుస్తకాలు, పద్దుల నిర్వహణ నాన్నగారు చూసుకునేవారు.

గుమస్తాలను చూసుకోవడం, బాకీలు వసూలు చేయడం, శ్రీ బెందడి లింగం గారు చూసుకునేవారు.

ఆదాయపు పన్ను, అమ్మకపు పన్ను, మున్సిపల్ పన్నులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర వ్యవహారాలు అన్నీ శ్రీ గుడ్ల వీర రాఘవులు గారు చూసుకునేవారు.

# వ్యాపారాభివృద్ధి

ప్రతి వ్యాపార నిర్వహణలోనూ వస్తువుల కొనుగోలు, అమ్మకాలు, వస్తు సరఫరాదారులతో ఒప్పందాలు, నగదు అనుకూలత, ఉద్యోగుల పరిపాలన, జమా ఖర్చులు వ్రాయడం మొదలైన అన్ని పనులు సమర్థవంతంగా నిర్వర్తించవలసి ఉంటుంది. వ్యాపారం మెరుగవుతున్న కొద్ది కార్య నిర్వహణ పద్ధతులలో మార్పులు తీసుకరావాలి.

నాన్నగారు నాణ్యమైన వస్త్రాలను కొనుగోలుచేసి, మార్కెట్‌లో ఉన్న షాపులకంటే తక్కువ ధరలకే కస్టమర్లకు అందజేస్తూ చుట్టుప్రక్కల 50 గ్రామాల రైతులకు వస్త్రాలను అప్పుగా ఇచ్చి సగానికి పైగా అరువు వ్యాపారం, మిగతా నగదు వ్యాపారం చేస్తూ అనతి కాలంలోనే ఖాతాదారులలో నమ్మకమైన వ్యాపార సంస్థగా తీర్చిదిద్దారు. వ్యాపారాన్ని బాగా అభివృద్ధి పరిచి ఖమ్మంలో రెండవ అతిపెద్ద వ్యాపార సంస్థగా ఎదుగుటకు అహర్నిశలు శ్రమించారు.

వస్త్రాలు అప్పు తెచ్చిన వారి వద్ద చెప్పిన తేదీ ప్రకారం బాకీలు చెల్లించేవారు. దీపావళి నాటికి స్టాకు తగ్గించుకుని మొత్తం బాకీలు చెల్లించేవారు. కోస్తా ప్రాంతంలో ఎవరు కూడా గుర్రం వెంకటేశ్వర్లు & కో సంస్థకు సరుకు ఇచ్చుటకు వెనుకాడేవారు కారు.

# ఆదిలోనే చుక్కెదురు

అలా వ్యాపారాన్ని అభివృద్ధి పరుస్తున్న క్రమంలో శ్రీ గుడ్ల వీర రాఘవులు గారి మామగారు శ్రీ గడ్డం వెంకయ్య గారు వీరి వ్యాపారానికి ఒక సమస్యను సృష్టించారు. అదేమిటంటే వ్యాపారం నీ ఒక్కడి సారధ్యంలోనే నిర్వహించుకోమన్నాను గాని గుర్రం వెంకటేశ్వర్లు గారిని, బెందడి లింగం గారిని భాగస్వాములుగా చేసుకోమనలేదని అడ్డు తగులుతూ ఒకరోజు షాపుకు తాళం వేయడం జరిగింది.

వ్యాపారం అంతా సవ్యంగా జరుగుతున్న క్రమంలో ఈ సమస్య పరిష్కారం వారికి ఆర్థికంగా కొంత భారాన్ని కలుగజేసింది. శ్రీ గడ్డం వెంకయ్య గారితో ముగ్గురు భాగస్తులు కలిసి చర్చించుకుని వారికి కొంత నగదును "గుడ్ విల్" కింద ఇచ్చి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకున్నారు.

ఇలాంటి అనుభవాల ద్వారా నాన్నగారు సమస్యలను పరిష్కరించుకునే నేర్పు, ఓర్పు అలవర్చుకున్నారు.


1960

# నూతన బ్రాంచి ఏర్పాటు

నాణ్యతకు మారుపేరుగా గుర్రం వెంకటేశ్వర్లు & కో సంస్థ వస్త్ర వ్యాపారంలో చుట్టుప్రక్కల అన్ని గ్రామాల ప్రజల మన్ననలు పొందుతూ వారి భాగస్వామ్యాన్ని అగ్రస్థానాన నిలబెట్టుకున్నారు. సరిగ్గా 10 సంవత్సరాల తర్వాత అనగా 1960వ సంవత్సరంలో కమాన్‌బజార్‌లో ఒక షాపు అద్దెకు తీసుకొని -

- "గుర్రం వెంకటేశ్వర్లు & కో బ్రాంచి" పేరుతో మరో వస్త్ర దుకాణాన్ని ప్రారంభించి ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించారు.

దీనికి శ్రీ గుడ్ల వీర రాఘవులు గారికి నిర్వహణా బాధ్యతలు అప్పజెపుతూ నిర్ణయం తీసుకున్నారు. తర్వాత వ్యాపారాన్ని అభివృద్ధి పరుస్తూ 1964వ సంవత్సరంలో కమాన్ బజార్‌లో సంస్థ తరపున ఒక జాగ కొన్నారు. అట్టి జాగలో క్రింది భాగం షాపు నిర్వహణకు, పై అంతస్తు నివాసానికి అనువుగా బిల్డింగ్ నిర్మాణం చేశారు. 1966వ సంవత్సరంలో ఆ నూతన నిర్మాణంలోకి అద్దె షాపులో నిర్వహించబడుచున్న గుర్రం వెంకటేశ్వర్లు & కో బ్రాంచిని మార్చడం జరిగింది. పై అంతస్తులో శ్రీ వీర రాఘవులు గారి కుటుంబానికి నివాసం ఏర్పాటు చేశారు.

# మకాం మార్పు

1962వ సంవత్సరంలో శ్రీ గుర్రం నరసింహ్వాం గారు తన ఇంటిని అమ్మకానికి పెట్టారన్న విషయం తెలుసుకున్న నాన్నగారు ఆ ఇంటిని 13000.00 రూపాయలకు ఖరీదు చేశారు. ఆ సందర్భంలో శ్రీ నరసింహ్వాం గారికి ఉన్న అప్పులను వారి తరుపున నాన్నగారే చెల్లించి మిగతా మొత్తమును వారికి ముట్టజెపుతూ ఆ ఇంటిని సొంతం చేసుకున్నారు.

నాన్నగారు ఆ ఇంటిని కొనటానికి నిజాంపేటలో ఉన్న ఇంటిని, గుట్టలబజారులో ఉన్న చిన్న ఇంటిని మరియు మా అమ్మగారి నగలను మొత్తం అమ్మి వ్యాపారం నుండి ఒక్క రూపాయి కూడా ముట్టకుండా ఇంటిని ఖరీదు చేసిన తర్వాత నిజాంపేట నుండి కమాన్‌బజార్‌కు మకాం మార్చారు.

వ్యాపారం బాగా అభివృద్ధి చెందాక అమ్మగారికి తిరిగి కొత్త నగలను చేయించారు. 1969లో ఆ ఇంటిపై మొదటి అంతస్తును అధునాతనంగా నిర్మించారు. విజయవాడ నుండి వర్కర్లను పిలిపించి రక రకాల డిజైన్లు నిర్మింపజేశారు. అప్పుడే కొత్తగా వస్తున్న సన్‌గ్లాస్‌లను అమర్చారు. తలుపులకు జిబ్రేగు కర్రతో డిజైన్లు చేయించారు. గృహ నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంటి నిర్మాణంలో పాల్గొన్న అందరు మేస్త్రిలను, భాగస్తులను, వారి కుటుంబ సభ్యులను తిరుపతి తీసుకెళ్ళారు.

# మార్పులను ఆస్వాదించడం

వ్యాపారం అభివృద్ధి చెందుతున్న కొద్ది ఎప్పటికప్పుడు కాలానుగుణంగా మార్పులు జరిపించేవారు. మొదట పెంకులతో నిర్మితమై ఉన్న షాపును బిల్డింగ్‌గా కట్టించారు. 100 అడుగుల షాపును 2000 చదరపు అడుగుల షాపుగా ఓనర్‌కు అడ్వాన్సులు చెల్లిస్తూ క్రమంగా మార్పులు చేశారు. కస్టమర్లకు నేల మీద కూర్చుని చూపించే విధానం నుంచి కౌంటర్ల విధానానికి మార్పించారు.

మొదట్లో ధరలు తానుపై బాల్ పెన్నుతో వ్రాసేవారు. ఆ తర్వాత రబ్బరు స్టాంపుతో వేయడం మొదలుపెట్టారు. తర్వాత స్టిక్కరుపై రబ్బరు స్టాంపుతో వేసి తానుకి, చీరలకు అతికించేవారు. ఆ తర్వాత చిన్న గుడ్డముక్కపై రేటువేసి తానుకి కుట్టించేవారు. ఇలా ప్రతి మార్పును ఆస్వాదించారు.

1966లో శ్రీ వీర రాఘవులు గారు నిర్వహించుచున్న బ్రాంచికి ఫర్నీచర్ చేయించినపుడు ప్రప్రథమంగా ఖమ్మంలో అప్పటి వరకు లేనివిధంగా ఫ్లోరింగ్ నుండి సీలింగ్ వరకు అధునాతనంగా తయారు చేయించారు. అప్పడే కొత్తగా వస్తున్న డెకోలం కౌంటర్లు చేయించారు.

వ్యాపార నిర్వహణలో భాగంగా ఉత్తర ప్రత్యుత్తరాలకు టైపు రైటింగ్ మిషన్ ఉపయోగించేవారు. గృహోపకరణాలైన టేపు రికార్డర్, ఫ్రిజ్ మొదలగునవి మార్కెట్లోకి వచ్చిన కొత్తలోనే వాటిని కొనుగోలు చేశారు.

# భాగస్తులపై నమ్మకం

అత్తరు దుకాణానికి వెళితే అక్కడ మనమేమి కొనకపోయినా కొంత పరిమళాన్ని తప్పక ఆఘ్రాణిస్తాం. ఉత్తముల సాహచర్యమూ అంతే.

ఎవరైనా నాన్నగారి స్నేహితులు మీ భాగస్తులు మీకు తెలియకుండా బట్టలు, డబ్బులు తీసుకుంటున్నారని ఒంటరిగా ఉన్నప్పుడు ఫిర్యాదు చేస్తే ఇలాంటి ఫిర్యాదులు దయచేసి నాతో ఎప్పుడూ చెప్పవద్దని, మేము ముగ్గురం కలిసి ఈ వ్యాపార మొక్కను నాటాము. అది ఇప్పుడు పెద్ద వృక్షమై ఫలాలను ఇస్తున్నది. వారు చెట్టుకు హాని చేయకుండా రెండు ఫలాలు ఎక్కువగా తిన్నంత మాత్రాన నాకు పోయేది ఏమీ లేదని వారికి నవ్వుతూ సమాధాన మిచ్చేవారు.



1969

# మరో బ్రాంచి ఏర్పాటుకు నిర్మాణం

1960వ సంవత్సరంలో అద్దె షాపులో బ్రాంచి ఏర్పాటు చేసి అనంతరం జాగ కొని దానిలో బిల్డింగ్ నిర్మించి అద్దె షాపులో నిర్వహించబడుచున్న బ్రాంచిని 1966లో స్వంత బిల్డింగ్‌లోకి మార్చిన తర్వాత 1967వ సంవత్సరంలో కమాన్‌బజారులో మరో జాగను కొన్నారు.

మొదటి బిల్డింగ్ మాదిరిగానే సంస్థ తరపునే క్రింది భాగంలో షాపు నిర్వహణకు, పై అంతస్తులో నివాసానికి అనువుగా ఉండే విధంగా నిర్మించారు. క్రింది భాగంలో వ్యాపారం నిర్వహించుకొనుటకు కావలసిన ఫర్నీచర్ మొత్తం చేయించి సిద్ధం చేశారు.

కాని తర్వాత 1969లో భాగస్తులు విడిపోయాక ఆ బిల్డింగ్‌ను శ్రీ బెందడి లింగం గారికి అప్పజెపుతూ దానిలో వారిచే నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభింపజేశారు.


1960
1969
1950

# భాగస్తులతో వ్యాపార విభజన

నాన్నగారితో పాటు మిగతా ఇద్దరి భాగస్వాముల వ్యాపార మజిలి 1950వ సంవత్సరంలో ప్రారంభమై 1969 వరకు 19 సంవత్సరాల కాలం పాటు స్నేహానికి మారుపేరుగా నైతిక, వ్యాపార విలువలను పాటిస్తూ, వ్యాపారాభివృద్ధి చేసుకుంటూ ఎవరికి వారు తనదైన ముద్ర వేసుకున్నారు. వారిలో నాన్నగారిది ప్రత్యేక స్థానం.

భాగస్తులు సొంత అన్నదమ్ములు కాకపోయినా, వేరే కులస్తులయినా అన్నదమ్ముల్లాగా కలిసి జీవించారు. అందరూ అన్నదమ్ములే అని భావించేవారు. వీరి అనుబంధాన్ని చూసి గిట్టనివారు వీరు ఎలా గొడవలు పడి విడిపోతారా అని ఎదురుచూసేవారు.

1950వ సంవత్సరంలో గుర్రం వెంకటేశ్వర్లు & కో

1960వ సంవత్సరంలో గుర్రం వెంకటేశ్వర్లు & కో బ్రాంచి

1969వ సంవత్సరంలో శ్రీ బెందడి లింగం గారికి ఏర్పాటు చేసిన షాపు

అలా వ్యాపారాన్ని విస్తరించుకుంటూ వచ్చారు. ఎంత కలిసిమెలిసి వ్యాపారం చేసినా ఏదో ఒకరోజు విడిపోక తప్పదనే నానుడి ఉండేది. అలాగే భాగస్తులు విడిపోయే రోజు రానే వచ్చింది. కాని అందరిలా కాకుండా వీరు ఎప్పుడు విడిపోతారా అని ఎదురుచూసేవారిని నిరాశపరుస్తూ ఇతరులకు తెలియకుండా వారు సామరస్యంగా చర్చించుకుని ముగ్గురూ ఒక నిర్ణయానికి వచ్చారు.

నాన్నగారు భాగస్తులు కోరిన విధంగా

గుర్రం వెంకటేశ్వర్లు & కో మొదటి బ్రాంచి బిల్డింగ్‌ను శ్రీ గుడ్ల వీర రాఘవులు గారికి, నూతనంగా రెండవ బ్రాంచి కోసం నిర్మించిన బిల్డింగ్‌ను శ్రీ బెందడి లింగం గారికి పంచి ఇచ్చినారు.

నాన్నగారు మాత్రం గేటు వద్ద ఉన్న అద్దె షాపును తాను వాల్చుకున్నారు. మొత్తం రావలసిన బాకీలు నాన్నగారు వాల్చుకున్నారు. స్టాకు మాత్రం మొదటిషాపు, బ్రాంచి షాపులో ఎలా ఉన్నది అలానే లెక్కించి నాన్నగారు, శ్రీ గుడ్ల వీర రాఘవులు గారు వాల్చుకున్నారు. శ్రీ బెందడి లింగం గారు మాత్రం నాకు స్టాకు వద్దు, బాకీలు వద్దు. నాకు రావలసిన మొత్తాన్ని నాకు వాల్చండి అని చెప్పగా వారికి చెల్లించాల్సిన మొత్తాన్ని వారి వాటా ప్రకారం లెక్కించి చెల్లించడం జరిగింది.

అలా 1969 సంవత్సరం దీపావళి రోజున ముగ్గురు కలిసి నాన్నగారు నిర్వహించుచున్న షాపులోనే దస్త్ర పూజ చేసుకుని తెల్లారి ఉదయం కల్లా షాపుల బోర్డులు మార్చుకుని అందరిని ఆశ్చర్యపరిచారు.

శ్రీ గుడ్ల వీర రాఘవులు గారికి వాటాగా వచ్చిన షాపును

జి. వీర రాఘవులు & కో గాను,

శ్రీ బెందడి లింగం గారికి వాటాగా వచ్చిన షాపును

బెందడి లింగం & కో గాను పేర్లు మార్పు చేసుకున్నారు.

ఈ సంఘటన అప్పటి వ్యాపార వర్గాల్లో ఆశ్చర్యానికి గురిచేసింది.

వ్యాపార విభజనతోపాటు ఉద్యోగులను కూడా విభజించాల్సి వచ్చింది.

శ్రీ బెందడి లింగం గారు నేను కొత్తగా షాపు పెట్టుకున్నాను. కాబట్టి నాకు అనుభవం గల పెద్ద గుమస్తాలను ఇవ్వమని కోరారు. వారు కోరిన విధంగా

శ్రీ వంగరు రామచంద్రం గారిని, శ్రీ వంగరు రాములు గారిని మరియు

శ్రీ బెందడి సత్యం గారిని వారి షాపుకు బదిలీ చేశారు.

ఆ తర్వాత మా మామయ్య గారు శ్రీ పోలా నాగయ్య, కుమారుడు శ్రీ పోలా హనుమంతరావు గారిని కలెక్టర్ ఆఫీస్‌లో టైపిస్ట్‌గా ఉద్యోగం చేస్తుంటే ఆ ఉద్యోగం మాన్పించి వారిని షాపులో తన వద్ద చేదోడు వాదోడుగా ఉంచుకుని ఉన్నత స్థానాన్ని అప్పజెప్పారు. క్యాషియర్‌గా, విధులు నిర్వర్తిస్తూ బ్యాంక్ పనులు చూసుకునేవారు.

నాన్నగారు చనిపోయినపుడు అది పెళ్ళిళ్ళ సీజన్ కావడం, 12 రోజుల పాటు మేము ఎవ్వరు షాపుకు వెళ్ళే అవకాశం లేనందున ఆ సమయంలో వారు విధులు నిర్వర్తించిన తీరు ప్రశంసనీయం.

# దస్త్ర పూజ

దీపావళి వస్తుందనగానే దస్త్ర పూజ హడావిడి మొదలయ్యేది. నాన్నగారే దగ్గరుండి షాపు మొత్తం శుభ్రం చేయించేవారు. గోడలకు సున్నాలు, రంగులు వేయించాల్సిన చోట రంగులు వేయించి దేవుని ఫోటోలు, పూజా మందిరంలోని విగ్రహాలు శుభ్రం చేయించి, ప్రత్యేకించి హైదరాబాద్ నుండి గోల్డ్ కలర్ చమ్కీ దండలు తెప్పించి వేసేవారు. దేవుని ఫోటోలతో పాటు నాన్నగారి అభిమాన నాయకులైన గాంధి, నెహ్రూ ఫోటోలకు కూడా కొత్త దండలు వేయించేవారు.

దీపావళికి 15 రోజుల ముందు నుండే ఖాతాదారుల ఖాతాలకు వడ్డీ లెక్కించి పెన్సిల్‌తో వారి ఖాతా పేజి నందు వ్రాసుకునేవారు. వారి వడ్డీ, అసలు మొత్తాన్ని ప్రింటెడ్ పోస్ట్ కార్డులపై వ్రాయించి వారికి తెలియపర్చేవారు. దీపావళి పండుగకు ముందు వచ్చే ఆదివారం నాడు ముగింపు నిల్వలు వేయించేవారు.

దస్త్ర పూజకు వై.ఎన్.ప్రెస్‌లో ఖాతా పుస్తకాలు ప్రత్యేకంగా తయారు చేయించేవారు. ముఫర్జు పుస్తకం 1000 పేజీలు ఉండేది. బిల్లు పుస్తకాలు జగ్గయ్యపేటలో ప్రింటు చేయించేవారు. తెనాలి నుంచి ప్రత్యేకంగా అశోకా కంపెని ఇంకు పెన్నులు తెప్పించేవారు. దస్త్ర పూజకు కార్డులు ప్రింటు చేయించి అతిథులను ఆహ్వానించేవారు.

ప్రతి దీపావళికి మూడు కుటుంబాల సభ్యులకు, వారి పిల్లలకు బట్టలు తానే స్వయంగా ఇప్పించేవారు. ప్రతి దస్త్ర పూజలో పది తులాల బంగారు బిస్కెట్లు కొనుగోలు చేసి పూజ చేయించేవారు. అదే ఆనవాయితి నేటికి కొనసాగుతూ వస్తున్నది.

శ్రీ కేదారేశ్వరి స్వామి వ్రతానికి పాత బజార్‌లో ఉన్న బుక్కా వారి వద్ద ప్రత్యేకంగా పట్టు తోరాలు చేయించి పూజలో ధరించేవారు. దీనిని క్రమం తప్పకుండా ఆచరించేవారు.

ప్రతి దీపావళికి ముగ్గురు భాగస్తులు ఒకే రకమైన నూతన వస్త్రాలు, కొత్త చెప్పలు ధరించి వారి స్నేహాన్ని చాటుకునేవారు. నాన్నగారు ఇంటివద్ద స్వీట్లు తయారుచేయించి సిబ్బందికి పంచేవారు. దీపావళి ఇనాముగా గుమస్తాలకు కొత్త రూపాయి నోట్లను ఇచ్చేవారు. అలా ఇచ్చేటప్పుడు గుమస్తాల కళ్ళలోని ఆనందాన్ని గమనిస్తూ తృప్తి పడేవారు.

మేళగాళ్ళు మంగళవాయిద్యాలు వాయించినందుకు టవల్స్, స్వీట్లు, ఇనాము ఇచ్చేవారు. సుతారి మేస్త్రిలకు, కార్పెంటర్లకు, పెయింటర్లకు అందరిని ఆహ్వానించి బట్టలు పెట్టేవారు. గవర్నమెంటు సంస్థల వారికి, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందికి, హమాలీలకు ఇనాము ఇచ్చేవారు. సఫాయి వారికి వస్త్రాలను ఇచ్చేవారు.

దీపావళి రోజునే చాలామంది వ్యాపారస్తులు దస్త్రపూజ నిర్వహించుకునే ఆనవాయితీ ఉండేది. వారి గుమస్తాలకు మరియు హమాలీలకు బట్టలు మరియు దస్త్రాలకు కట్టే గుడ్డలను గుర్రం వెంకటేశ్వర్లు గారి షాపులోనే ఖరీదు చేయడం సెంటిమెంటుగా భావించేవారు.

నాన్నగారి దగ్గర పనిచేసిన కొందరు గుమస్తాలు స్వంత వ్యాపారాలు పెట్టుకుని దీపావళి రోజున వారు కూడా నాన్నగారి షాపుకి వచ్చి దస్త్ర పూజ నిర్వహించుకుని వెళ్ళటం వారు అదృష్టంగా భావించేవారు. దీపావళి మరుసటి రోజున మొదటి ఖరీదు చేసిన కొనుగోలు దారునికి టవల్ కప్పి తాంబూలం ఇచ్చేవారు.

చాలామంది కోస్తా సప్లయిదారులు దీపావళి దస్త్రపూజ తర్వాత వారి మొదటి బిల్లును గుర్రం వెంకటేశ్వర్లు & కో పేరుతో 11 శాల్తీలు బిల్లు వ్రాసి సరుకును పంపేవారు.

# ఖరీదు విధానం

దీపావళి వెళ్ళిన మూడవనాడు ఆనవాయితీగా శ్రీ వీర రాఘవులు గారు, శ్రీ బెందడి లింగం గారు మరియు నాన్నగారు విజయవాడ బట్టల ఖరీదుకు వెళ్ళేవారు. ఖరీదుకు వెళ్ళేటపుడు షాపులోకి కావలసిన సరుకును రంగులతో సహా డైరీలో వ్రాసుకునేవారు. సాధారణంగా మూడు మాసాలకు ఒకసారి సొత్ ఖరీదుకు వెళ్ళి వచ్చేవారు.

అప్పట్లో నగదు ఖరీదు ఎక్కువగా ఉండేది. అంతేగాక వారి 15, 20 రోజులకు సరిపడా ఖర్చుల నిమిత్తం నగదును వెంట తీసుకెళ్ళాల్సి ఉంటుంది. దానికి గాను వారు ఒక సంచిలో డబ్బులు దాచి ఆ సంచిని నడుము భాగానికి కట్టుకుని దానిపై బెల్టులాంటి దాన్ని ధరించేవారు. అన్ని రోజులకు సరిపడా బట్టలు "బెడ్డింగ్"లో సర్దుకుని ప్రయాణించేవారు. (బెడ్డింగ్ అనగా బట్టలు, దుప్పట్లు వగైరా అన్ని దానిలో సర్దుకొని దానిని వీపుకు కట్టుకొని ఉండేలా అనువుగా ఉంటుంది).

ఆ రోజుల్లో రైల్వే రిజర్వేషన్ సౌకర్యం అంతగా లేనందున సాధారణ భోగీల్లోనే ప్రయాణించేవారు. రాత్రిపూట దిగవలసిన స్టేషన్ వస్తే రైల్వే ప్లాట్ ఫారం పైనే వారి వీపుకు ఉన్న బెడ్డింగ్ పరుచుకుని నిద్రించేవారు. వీలైనంత వరకు పార్టీల గెస్ట్‌హౌస్‌లలో బస చేసేవారు. చిన్న చిన్న ఊర్లయితే పార్టీల ఇంటిలోనే బస చేసేవారు. కొన్నిచోట్ల అసోసియేషన్ సత్రాలలో నిద్రించే వారు. ప్రత్యేకంగా పెద్ద పార్టీలకు ఆరోజుల్లో కస్టమర్ల కోసం గెస్ట్‌హౌస్‌లు ఉండేవి.

నాన్నగారు ఖరీదుకు వెళ్ళినపుడు ప్రతి రూపాయి లెక్క వ్రాసేవారు. ఎందుకలా వ్రాస్తున్నారని ప్రశ్నిస్తే "పారేసినా ఎంచి పారేయాలని" పెద్దలు చెప్పిన మాటలు చెప్పేవారు.

కాలానుగుణంగా ఎప్పటికప్పుడు ఆ సీజన్ వెరైటీలు ముందుగా నాణ్యమైనవి తెప్పించేవారు. ఉదాహరణకు వర్షాకాలంలో బుట్ట మార్కు, జింక మార్కు గొడుగులు మద్రాసు నుండి డైరెక్టు కంపెనీ నుండి తెప్పించేవారు. గొడుగులు చిరిగితే కుట్టుకొనుటకు గొడుగు గుడ్డలు కూడా తెప్పించి అమ్మేవారు. చలికాలంలో Simplex - బెన్ని రగ్గులు, షోలాపూర్ బెడ్‌షీట్లు, దారివాలా మఫ్లర్లు, బెన్ని శాలువాలు ముందుగా ఆర్డర్ పెట్టి తెప్పించేవారు.

సాత్ ఖరీదు విజయవాడ నుండి ప్రారంభమై మంగళగిరి, గుంటూరు, తెనాలి, చీరాల, వెంకటగిరి, నగిరి, మద్రాసు, ఆరణి, తిరు నాగేశ్వరం, తంజావూరు, వరయూరు (తిరుచ్చి), మధురై, కోయంబత్తూరు, ఈరోడ్, సేలం, బెంగళూరు నుండి హైదరాబాద్ చేరుకుని ఖమ్మం వచ్చేవారు.

విజయవాడ : మొదట అన్ని షాపులు తిరిగి కావలసిన వస్త్రాలు సెలక్షన్ చేసి డైరీలో వ్రాసుకుని సాయంత్రం వచ్చి ఫైనల్ చేసి అన్ని కొనుగోళ్ళను ఒక దగ్గరకు చేర్పించి ట్రాన్స్‌పోర్ట్ చేయించేవారు.

నాన్నగారికున్న మంచి పేరుని బట్టి చిన్న చిన్న అవసరాలు ఏవైనా ఉంటే అక్కడి ప్రముఖ సంస్థల గుమస్తాలే స్వయంగా మార్కెట్‌కు వెళ్ళి ఖరీదు చేసి ట్రాన్స్‌పోర్ట్ చేయించేవారు.

సికింద్రాబాద్ : ఇక్కడ ఖరీదు చేసిన వస్త్రాలు "సాంచా" (బేల్ ప్యాకింగ్ గోడౌన్) కు పంపించేవారు. ఒక్కో బేలు దాదాపు 100 కేజీల వరకు ఉండేది. అలా దాదాపు 10 బేళ్ళ సరుకు ఖరీదు చేసేవారు. అక్కడే రెండు రోజులు ఉండి హైదరాబాద్ ఆబిడ్స్ ప్యాలస్ హెూటల్‌లో బస చేసేవారు.

నాన్నగారు ఖమ్మం వచ్చిన మొదట్లో ముస్లిం మతస్తులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో నివసించినందున తక్కువ సమయంలోనే హిందీ మాట్లాడటం నేర్చుకున్నారు. అప్పుడు నేర్చుకున్న హిందీ ఖరీదుకు వెళ్ళినపుడు ఉపయోగపడేది. కేవలం 4వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నందున ఇంగ్లీష్ అంతగా వచ్చేది కాదు.

ఇంగ్లీష్ అక్షరాలు వ్రాయగలిగేవారు.  సప్లయిదారుల షాపుల యొక్క నేమ్ బోర్డులు చదవగలిగేవారు.

**బొంబాయి:**

బొంబాయికి ఖరీదుకు వెళితే "పేడీ ఆఫీస్" (కమీషన్ ఏజెంటు ఆఫీస్) లో బస చేసేవారు. రోజూ అన్ని మార్కెట్లకు వెళ్ళి ఖరీదు చేసి పేడీ ఆఫీస్‌కు పంపేవారు.  మరుసటిరోజు నిన్న ఖరీదు చేసిన సరుకు ఋజువు చూసుకుని నచ్చనివి ఉంటే అక్కడే వాపసు పంపి మిగతా వాటిని ట్రాన్స్‌పోర్ట్ చేయించేవారు.  బొంబాయిలోనే షాపుకి కావాల్సిన అన్ని స్టేషనరీ సామాన్లు అక్కడే ఖరీదు చేసేవారు.

కొత్త వస్తువులు ఏవైనా మార్కెట్లో కనిపిస్తే వాటిని ఖరీదుచేసి ముగ్గురు భాగస్తులు సమానంగా తీసుకునేవారు. ఇంటికి పిల్లలకు బొంబాయి స్వీట్లు, బొమ్మలు తెచ్చేవారు. ఖరీదుకు వెళ్ళినపుడు డ్యామేజి ఉన్న వస్త్రాలను వెంట తీసుకుని వెళ్ళి వాటిని మార్చుకుని కొత్తవి తెచ్చుకోవడం విశేషం.

**బెనారస్:**

బెనారస్ ఖరీదుకు వెళ్ళినపుడు మార్వాడి సత్రం జపూరియా భవన్‌లో బస చేసేవారు. అక్కడ భోజన సౌకర్యం కూడా ఉండేది. కాశీ విశ్వేశ్వరుని దర్శించుకుని ఖరీదు ప్రారంభించేవారు. ఇక్కడ మీకు ఒక వర్తక కేంద్రం గురించి వివరించదలచు కున్నాను.

**సట్టి** : ఆయా మగ్గం దారులు తయారుచేసిన వస్త్రాలు ఒక కమీషన్‌దారు ద్వారా విక్రయించు కేంద్రాన్ని సట్టి అనేవారు.

ఆ కేంద్రానికి మగ్గందారులు వారు నేసిన చీరలను సట్టి వద్దకు తీసుకవస్తారు. ఆ సట్టి వద్ద మన ఏజెంటు కాకుండా మరో (ఏజెంటు) కమీషన్‌దారు కూర్చుని ఉంటారు. మన తరపున మగ్గందారులతో మధ్యవర్తిగా ఆ కమీషన్‌దారు వ్యవహరించి కొనుగోలు జరిపిస్తారు. అలా ఖరీదు చేసిన వస్త్రాలు మన ఏజెంటు వద్దకు వచ్చేవి. అంటే ఈ మొత్తం వ్యవహారంలో ఇద్దరు కమీషన్‌దారుల ప్రమేయం ఉండేది.

అక్కడే డ్యామేజి, వగైరా చెక్ చేసుకుని, నచ్చనివి అక్కడే వాపసు ఇచ్చి మిగిలినవి బిల్లు చేయించుకునేవారు. అలా బెనారస్‌లో కనీసం వారం రోజుల పాటు ఖరీదు చేసేవారు. ఆ రోజుల్లో బెనారస్ నుండి ఖమ్మం వరకు డైరెక్టు ట్రాన్స్‌పోర్ట్ లేనందున చీరలను 6, 7 ట్రంకు పెట్టెలలో ప్యాక్ చేయించుకుని రెండు రైళ్ళను మారి ఖమ్మం తీసుకవచ్చేవారు.

బెనారస్ వర్తకులలో శ్రీ రాధేశ్యాం మిశ్రా గారు ప్రముఖులు మరియు నాన్న గారికి చాలా సన్నిహితులు.

# ప్రత్యేక నాణ్యమైన వస్త్రాలు

**పట్టుబడి చీరలు :**

పట్టుబడి చీరలలో వక్కలగడ్డ పేరిశెట్టి వారి వస్త్రాలు బాగా పేరెన్నిక గలవి.

**జరీ చీరలు :**

గుంటూరు జరీ చీరలు మరియు పట్టుబడి చీరలలో రమాకాంతం చీరలు, చీరాల గుండమ్మ చీరలు పేరెన్నిక గలవి.

**నేత చాపులు :**

రైతులకు భట్టిప్రోలు, ఏలూరు, నగిరి, తిర్పూరు నుంచి నాణ్యమైన నేత పంచెలు, కోరా, ఖాదీ క్లాత్ మెట్టూరు, మల్లూరు లాన్ క్లాత్‌లు తెప్పించేవారు.

**దుప్పట్లు :**

షోలాపూర్, సేలం నుండి భవాని జంపకానాలు, ఉలెన్ రగ్గులు, శంఖుమార్కు లుంగీలు, బెన్ని మిల్లు వస్త్రాలు, ఫిన్ లే గ్లాస్కో చాపులు, మొరార్జి కాలిగోల్డ్ ధోతులు తెప్పించేవారు.

**సూటింగ్స్ :**

గ్వాలియర్, ఎస్ కుమార్, రేమండ్స్, బెన్ని మిల్లు మొదలగునవి ఎక్కువగా తెప్పించేవారు.

**షర్టింగ్స్ :**

అశోకా టెర్లిన్, మఫత్ లాల్, బోంబే డైయింగ్, శ్రీనివాసా మిల్స్, బెనారస్, బెంగళూరు పట్టు షర్టింగ్ బాగా తెప్పించేవారు.

**పట్టు చీరలు :**

పట్టు చీరలలో ప్రముఖంగా కంచి, ఆరణి, తంజావూరు, బెంగళూరు మరియు బెనారస్ నుండి ప్రత్యేకంగా తెప్పించి అమ్మేవారు.

ఖరీదు చేసి వచ్చిన తర్వాత ఆదివారం నాడు బేళ్ళు ఓపెన్ చేసి శ్రీ వీర రాఘవులు గారిని పిలిపించి ఇద్దరూ కూర్చుని రేట్లు వేసిన తర్వాత ఒకరు ముందు, ఒకరు తర్వాత అనే పద్ధతిలో స్టాకు పంచుకునేవారు. ఆ రోజుల్లో వారి షాపులను HO, బ్రాంచి అనే పేర్లతో సంభోదించుకునేవారు. చిన్న చిన్న మూటలు వచ్చినపుడు అప్పటికపుడు ఓపెన్ చేయించి రేట్లు వేసేవారు.

వ్యాపార విభజన తర్వాత విజయవాడ ఖరీదుకు వెళ్ళినపుడు వీరికో అనుభవం ఎదురైంది. విజయవాడలో హెూల్‌సేల్ వ్యాపారస్తులకు చెల్లించాల్సిన అప్పలను లెక్కించి ఎవరికి వారికి వాటాలుగా విభజించమని నాన్నగారు మరియు భాగస్తులు వారిని కోరగా అందుకు వారిలో కొంతమంది వ్యాపారులు అలా విభజించి వ్రాయటానికి అంగీకరించలేదు. మేము గుర్రం వెంకటేశ్వర్లు & కో కి అప్ప ఇచ్చాము, ఆ పద్దులన్నిటికి నాన్నగారిదే బాద్యత అని తేల్చి చెప్పారు.

అప్పడు శ్రీ వీర రాఘవులు గారు నాన్నగారితో ప్రస్తుతం ఉన్న బాకీలన్ని మీరే వాల్చుకోండి, తర్వాత రెండు మూడు నెలలలో తిరిగి చెల్లిస్తానని కోరగా అందుకు నాన్నగారు అడిగిందే తడవు ఎట్టి సంకోచం లేకుండా, బాకీలన్ని తన పేరునే వాల్చుకున్నారు. తర్వాత ఆ పద్దుల తాలూకు వాటాగా శ్రీ వీర రాఘవులు గారు నిజాయితీగా తీర్చి వేశారు.

తర్వాత ఖరీదులలో నాన్నగారు శ్రీ వీర రాఘవులు గారిని,
శ్రీ బెందడి లింగం గారిని వస్త్రాలు ఖరీదు చేసే ప్రతి ప్రదేశానికి తీసుకెళ్ళి తాను జమానుతుగా ఉండి వారికి వస్త్రాలు ఇప్పించారు. వారి స్వంత వ్యాపారానికి తోడ్పాటునందించారు.

# చిన్న వ్యాపారులను ప్రోత్సహించేవారు

నాన్నగారు హెూల్‌సేల్ చిన్న వ్యాపారులను బాగా ప్రోత్సహించేవారు. వారి వద్ద ఖరీదు చేయుటకు ప్రత్యేక శ్రద్ధ కనబర్చేవారు. సౌత్‌లో పెద్ద షాపుల నుండి బయటకు వచ్చి స్వంత దుకాణాలు పెట్టుకున్న వారి వద్ద భారీగా ఖరీదుచేసి వారిని ప్రోత్సహించేవారు. అలాగే మగ్గాల వద్ద నుండి చీరలు నేసి వాటిని మూటకట్టుకుని తెచ్చే నేత చీరల వారి వద్ద ఖరీదు చేసి వారికి తక్షణమే నగదు చెల్లింపు చేసేవారు.

అప్పట్లో చేనేత వృత్తి జీవనాధారం గలవారు కూడా బట్టల దుకాణాలలో గుమస్తాలుగా ఉద్యోగం చేసేవారు. అలా గుమస్తాల తల్లిదండ్రులు వారి ఇంటి వద్ద నేచిన చీరలను తానే కొనుగోలు చేసి వారికి నగదు చెల్లింపు చేసేవారు. అంతేగాక వారికి అవసరమైన నూలుని సమకూర్చుటలో సాయపడేవారు.

విజయవాడలో చిన్న హెూల్‌సేల్ వ్యాపారి అయిన శ్రీ కూర్మాల రాఘవులు గారు మరియు బృందావన శారీనికేతన్ కృష్ణ గారి వద్ద ముందుగా ఖరీదు చేసేవారు.

# ఖాతాల నిర్వహణ

నాన్నగారే ప్రతిరోజు రోజు బుక్, ముఫర్జు వ్రాసేవారు. రోజుబుక్‌లో రోజును ప్రారంభించేటపుడు పై భాగాన శ్రీ యాదాస్తు అని ప్రారంభించి ఆరోజు వార, తిథి, నక్షత్ర మరియు తేదీతో ముగించేవారు.

ఖాతాదారుల పద్దులు మొత్తం మొదట చిత్తు బుక్‌లో ఖర్చు వ్రాసి వారితో సంతకం లేదా వేలిముద్ర తీసుకునేవారు. రాత్రికి రోజుబుక్‌లో పద్దులు ఎక్కించేవారు. మరుసటి రోజు ముఫర్జు చేసేవారు.

గ్రామాల నుంచి రైతులు వారే స్వయంగా వచ్చి పద్దులు జమ చేయించుకుని పోయేవారు. పంటలు అమ్మినపుడు పద్దులు జమచేసేవారి సంఖ్య ఎక్కువగా ఉండేది. అందరికి పంటలు ఒకేసారి చేతికి వచ్చి, ఒకేసారి మార్కెట్‌లో అమ్ముకొనుటకు వస్తుంటారు. అలా ఒక్కోరోజు దాదాపు 70, 80 పద్దులు జమ అయ్యేవి. వారి వద్ద పద్దులు వడ్డీ లెక్కించి తీసుకునేవారు. ఆ రోజుల్లో క్యాలిక్యులేటర్లు ఉండేవి కావు. పోలా హనుమంతరావు గారికి రోజంతా రశీదులు వ్రాయటానికే సరిపోయేది.

నెల నెలా ఖాతాదారుల ఖాతాలు చెక్ చేయుటకు చుక్క వేయుట అనే విధానాన్ని అనుసరించేవారు.

ఖరీదు బిల్లులను పార్టీల పేరున జమకట్టి బట్టల ఖరీదు ఖాతాకు ఖర్చు వ్రాసేవారు. కోస్తా వారికి పేమెంట్లు ఇచ్చేటపుడు వారి వద్ద రశీదు తీసుకుని రోజుబుక్‌లో సంతకం తీసుకునేవారు. సికింద్రాబాద్ పార్టీలకు రశీదు పుస్తకం ఉండేది కాదు. వారి వద్ద "తగాదా" అని ఎర్రని పొడుగు పుస్తకం ఉండేది. ఆ పుస్తకంలో వారు మన దస్తూరితో జమ కట్టించి తెలుగు అంకెలతో వ్రాయించేవారు. వారి బిల్లులు కూడా తెలుగు అంకెలతోనే వచ్చేవి. ఖరీదు బిల్లులు జమ, ఖర్చు చేసేటపుడు ఊర్ల పేర్ల ప్రకారం పేర్చి చేసేవారు.

ముఖ్యమైన ఖాతాలన్ని ప్రతి సంవత్సరం ఒకే పేజి నంబరుతో వ్రాసేవారు. ఉదా॥ మొదటి పేజీలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఖాతా, 251 పేజి నంబరులో బట్టల ఖాతా, ఒకే ఊరి పేరుతో ఉన్న ఖాతాలన్ని ఒకేచోట వచ్చే విధంగా వ్రాసేవారు. కోయచెలక, కొత్తలింగాల, ఊట్కూరు, మంచుకొండ, తెల్దారుపల్లి, పిండిప్రోలు మొదలైన గ్రామాల అందరి రైతుల ఖాతాలు నాన్నగారి దగ్గరే ఉండేవి. అన్ని రకాల పన్నుల వ్యవహారాలు శ్రీ వీర రాఘవులు గారు చూసుకునేవారు. జె.సుబ్బరామయ్య & కంపెనీ వారు ఆడిటింగ్, ఆదాయపన్ను వ్యవహారాలు చూసుకునేవారు.

శ్రీ మండేశ్వరరావు & కంపెనీ వారు సేల్ టాక్స్ వ్యవహారాలు చూసుకునే వారు. శ్రీ వంగరు రామచంద్రం గారు అకౌంటెంట్‌గా విధులు నిర్వహించేవారు. చిన్న వారైనా వారి సలహాలు శ్రద్ధగా విని నచ్చిన విషయాలు పాటించేవారు.

స్టాకు సరిచూసుకున్నప్పుడు స్టాకు పొరపాటున వచ్చినా, సప్లయిదారు బిల్లును పొరపాటు వ్రాసినా వాటిని సవరించి వారికి తెలియపర్చేవారు. ఏరోజు కూడా లెక్కలు సరిచూసుకోకుండా షాపు బంద్ చేసేవారు కారు. నాన్నగారే బిల్లులు స్వయంగా వ్రాస్తూ క్యాష్ తీసుకునేవారు.

ఒకరోజు షాపులో 500/- రూపాయలు తరుగు వచ్చినది. ఎంత చెక్ చేసినా ఆ తప్పిదం దొరకలేదు. షాపు బంద్ చేసి ఇంటికి వచ్చిన తర్వాత నాన్నగారు నన్ను తరుగు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. దానికి ఏడుస్తూ నేను తీయలేదని నిజాయితీగా సమాధానమిచ్చాను. అప్పుడు నాన్నగారు పిచ్చివాడ, నువ్వు తీశావని నా సందేహం కాదు, లెక్క కోసం అడిగాను తప్ప వేరే ఉద్దేశం కాదని, లెక్కల పట్ల నిబద్ధతను మా ముందు ప్రదర్శించారు.

ఇవ్వగలిగి ఇవ్వకుండా ఎన్ని ఉత్తరాలు వ్రాసినా, ఒకటికి నాలుగు సార్లు గుమస్తాలను పంపినా పద్దులు ఇవ్వకపోతే శ్రీ బెందడి లింగం గారిని పంపి వసూలు చేసేవారు. అప్పటికి ఇవ్వని బాకీలకు లాయర్ నోటీసు ఇప్పించి పద్దు ఇచ్చేవరకు వదిలి పెట్టేవారు కాదు.

కొన్ని పద్దులు ఆ ఊరి గ్రామ పెద్దకు చెప్పడం ద్వారా వసూలు చేసేవారు. కొన్ని గ్రామాలలో రైతులకు కోపరేటివ్ బ్యాంక్ లోన్లు వచ్చినపుడు ఆ ఊరి గ్రామ పెద్ద నాన్నగారికి తెలియపర్చి, దగ్గరుండి మరీ పద్దులు ఇప్పించేవారు.

# చెల్లింపు విధానం

ప్రతిరోజూ ఉత్తరాలను తానే స్వయంగా పరిశీలించడం నాన్నగారి దిన చర్యలో భాగంగా ఉండేది. ఆ రోజుల్లో సప్లయిదారులు కలెక్షన్‌కు ఏరోజు వస్తారో ఆ తేదీని ఉత్తరాల ద్వారా తెలియపర్చేవారు. తద్వారా ఏ పార్టీవారు ఎప్పుడు వస్తారో ముందుగా తెలియడం ద్వారా ఆ వివరాలను నాన్నగారు డైరీలో వ్రాసిపెట్టుకునేవారు. అలాగే డ్రాఫ్ట్ పంపవలసిన పేమెంట్లు కూడా చెల్లింపు తేదీలను డైరీలో వ్రాసేవారు.

సహజంగా కలెక్షన్‌కు వచ్చేవారు ఉదయమే వచ్చి సాయంత్రం వస్తామని చెప్పి వెళ్లేవారు. సాయంత్రం 7.00గం॥ నుండి చెల్లింపులు చేసేవారు. అయితే ఒక్కోరోజు ఎక్కువ మంది పార్టీలు వచ్చేవారు. అందువల్ల ఇవ్వవలసిన మొత్తం ఎలా సమకూరుతుందో అని నాకు సందేహం కలిగేది. అయితే ఆరోజు అమ్మకం ఎక్కువగా ఉండటమో, బాకీలు వసూలు కావడమో జరిగేది. ఇది నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించేది. అలా ఎలా జరగేదని నాన్నగారిని అడిగితే మనం మంచి మనస్సుతో వారి బాకీ చెల్లించాలని కోరుకుంటున్నాము. కాబట్టి భగవంతుడు ఆ డబ్బుని ఆ రూపంలో సమకూర్చుతున్నాడని నిజాయితీతో కూడిన సమాధానమిచ్చేవారు.

చెల్లింపులు పోగా మిగిలిన డబ్బుని ఆంధ్రాబ్యాంక్‌లో మరుసటిరోజు జమ చేయించేవారు. అలా జమ అయిన మొత్తాన్ని వారాని కొకసారి డ్రాఫ్ట్ తీసి దూర ప్రాంతాల పార్టీలకు చెల్లింపు తేదీల ప్రకారం పోస్ట్ ద్వారా పంపేవారు.

# నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

దీనినే నైతిక విలువలకు కట్టుబడి ఉండటం అని కూడా అంటారు. కేవలం డబ్బు సంపాదించడం కాదు. నిజాయితీగా జీవించడానికి తీవ్రమైన ఆకాంక్ష ఉండాలి.

నైతిక విలువలకు కట్టుబడి వ్యాపారం చేసే సంస్థలతో సంబంధాలు కొనసాగించుటకు ఎక్కువమంది వినియోగదారులు ఇష్టపడుతారనడానికి నేనొక చిన్న ఉదాహరణ చెపుతాను.

ఒకసారి నాన్నగారు నాకొక పని అప్పజెప్పారు. అదేమిటంటే పాత అమ్మకం బిల్లుల టోటల్స్ చెక్ చేయడం. అలా చెక్ చేస్తుంటే ముదిగొండ గ్రామం నుండి వచ్చే ఒక రెగ్యులర్ కస్టమర్ శ్రీ యలమద్ది వెంకయ్య గారి బిల్లులో కూడిక పొరపాటు వలన 1000/- రూ॥ ఎక్కువగా తీసుకోవడం జరిగింది. అది జరిగి అప్పటికి నాలుగు నెలలు గడిచిపోయాయి. అట్టి పొరపాటును క్షమించమని కోరుతూ నాన్నగారు ఉత్తరం ద్వారా వారికి తెలియపర్చి 1000/- రూ॥ వారికి తిరిగి ఇచ్చేయడం జరిగింది. జరిగిన సంఘటనలో నాన్నగారి నిజాయితీ పట్ల వారు మరింత నమ్మకాన్ని పెంచుకుని చుట్టుప్రక్కల గ్రామాల రైతులను కూడా మా దగ్గరే వస్త్రాలు కొనమని ప్రేరేపించేవారు. ఆ కస్టమర్ జీవించి ఉన్నంతకాలం మా దగ్గరే వస్త్రాలు కొన్నారు.

# కస్టమర్లతో సన్నిహిత సంబంధాలు మౌలిక సదుపాయాల కల్పన

కేవలం నాణ్యతగల వస్తువులు తెప్పించడమే కాదు, తెప్పించిన వస్తువులు పోటీతత్వంతో కూడిన మార్కెట్‌లో అమ్మగల తెలివితేటలు, కస్టమర్స్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నప్పుడు మాత్రమే అవి భవిష్యత్తులో చక్కని ప్రతిఫలాలు ఇచ్చి తీరుతాయి.

కస్టమర్లకు తగిన గుర్తింపునివ్వడం, వ్యాపార ప్రదేశంలో కొనుగోలు వాతావరణాన్ని సృష్టించడం ద్వారా వారి అవసరాలను గుర్తించి కొనుగోలులో వారికి సాయపడటం ఇవన్నీ కూడా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చిపెడతాయి.

కస్టమర్లతో అవినాభావ సంబంధాలు కొనసాగించుటలో నాన్నగారిది ప్రత్యేక స్థానం. నాన్నగారు ప్రతి కస్టమర్‌ను వారి ఇంటిపేరుతో సహా సంబోదించి పలకరించడం వారి మధ్య సాన్నిహిత్యానికి నిదర్శనం. అప్పట్లో షాపు ఉదయం 8.00 గం॥కే తెరిచేవారు. 8.00 గం॥కు గోల్కొండ రైలు వచ్చిన తర్వాత ఆ రైలు ద్వారా వచ్చే కొనుగోలుదారులతో షాపు మొత్తం నిండిపోయేది. దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రతి కస్టమర్‌కు మంచినీరు ఇప్పించేవారు. కేవలం మంచినీళ్ళు ఇవ్వడానికే ఒక గుమస్తాను నియమించేవారు.

పెళ్ళిళ్ళ సీజన్‌లో వ్యాపారం ఎక్కువగా ఉన్నప్పుడు కస్టమర్లకు సినిమా టికెట్లు తెప్పించి పంపేవారు. వారు సినిమా చూసి వచ్చిన తర్వాత కావలసిన బట్టలు ఇప్పించేవారు. అలాంటి కస్టమర్లు వారి పంటల నుండి కూరగాయలు, కందులు, పెసలు, మినుములు మొదలగునవి తెచ్చి ఇచ్చి వారి అభిమానాన్ని కూడా అంతే చాటుకునేవారు.

మేడేపల్లి గ్రామ ఖాతాదారు శ్రీ సామినేని వెంగళయ్య గారు తన చేనులో పండిన శనక్కాయలు కాల్పించి తెచ్చి మరీ నాన్నగారికి, గుమస్తాలకి ఇచ్చేవారు.

పల్లెటూర్ల నుండి వచ్చే కష్టమర్లకు భోజన సౌకర్యం ఏర్పాటు చేసేవారు.

# మార్కెటింగ్ వ్యూహాలు

నాన్నగారు వ్యాపారాన్ని అభివృద్ధి చేయుటలో అనేక పద్ధతులు అవలంభించేవారు. కొనుగోలు దారులు నేరుగా వచ్చి కావలసిన వస్తువులు కొనుగోలు చేయడం సాధారణ పద్ధతి అయితే ప్రేరణ ద్వారా కూడా మార్కెటింగ్ చేసుకోవచ్చని నమ్మేవారు.

నాన్నగారు కస్టమర్లు, సప్లయిదారులతో మాత్రమే గాకుండా చుట్టూ ఉన్న ఇతర వ్యాపారస్తులతో కూడా స్నేహ సంబంధాలు నెలకొల్పేవారు. దీని ద్వారా ఏ రంగం వారు ఆ రంగంలో వ్యాపార వృద్ధి సాధించవచ్చని వారి నమ్మకం. అలా బంగారం వ్యాపారులు, కమీషన్ వర్తకులు, కిరాణం వర్తకులు ముఖ్యంగా చెప్పకోవచ్చు.

కమీషన్ వర్తకులు తమ వద్దకు పంటలను అమ్ముకొనుటకు వచ్చిన రైతులను బట్టల కొనుగోలుకు మా షాపుకి వెళ్ళమని ప్రోత్సహించేవారు. అలాగే నాన్నగారి వద్ద పెళ్ళి బట్టలు కొన్న కస్టమర్లకు బంగారం కొనుగోలుకు వారి షాపుకు వెళ్ళుటకు వారిని వెంట తీసుకెళ్ళేవారు. కమీషన్ వర్తకులు మంచి ఆసాములను పరిచయం చేస్తూ లెటర్ వ్రాసి పంపేవారు. అలాంటి వారికి నాన్నగారు పద్దులు కూడా పెట్టేవారు. అలా వారు మాకు రెగ్యులర్ కస్టమర్‌గా అయ్యేవారు. మోతుబరి రైతుల ద్వారా కూడా మరికొంతమంది రైతులు పరిచయమయ్యేవారు.

కస్టమర్లు ఇప్పటిలాగా వెరైటీల కోసం పలు షాపులు తిరిగేవారు కారు. తుండు గుడ్డ మొదలు పట్టు చీలర వరకు అన్నీ ఒకేచోట దొరికేవి.

సగం మందికి పైగా కస్టమర్లు అరువు విధానంలో కొనుగోలు చేసేవారు.  మరి కొద్దిమంది ఉద్యోగస్తులు నెలవారి చెల్లింపు విధానంలో కొనుగోలు చేసేవారు.

ఆ రోజుల్లో బ్రాహ్మణ కుటుంబాల గృహిణిలు, బాగా పేరున్న కుటుంబాల ఆడవారు గడపదాటి బయటకు వచ్చేవారు కాదు. వారికి ఏ అవసరాలు సమకూర్చాలన్నా సంబంధిత పనివారు ఆ పనులు చేసి పెట్టేవారు.  అలా బట్టలు కొనడానికి కూడా వారు బట్టల షాపులకు వచ్చేవారు కారు.

అలాంటి వారి అవసరాల మేరకు వారు కోరితే నాన్నగారు కొత్తగా వచ్చిన వెరైటీలు అన్నీ ఒక మూటలాగా కట్టి గుమస్తాను ఇచ్చి వారింటికి పంపి సెలక్షన్ చేయించేవారు. ఇలాంటివి కూడా అమ్మకంలో ఒక భాగంగా ఉండేవి.

# సప్లయిదారులతో సత్సంబంధాలు

ఒకసారి బెనారస్ నుండి సప్లయిదారు శ్రీ రాధేశ్యాం మిశ్రా గారు మొదటిసారి ఖమ్మం వచ్చారు. అప్పట్లో వారు వచ్చేటపుడు వారి వెంట చీరలను ట్రంకు పెట్టెలలో తీసుకవచ్చేవారు. ఆ ట్రంకు పెట్టెలను రిక్షాలో పెట్టించుకుని ఒక షాపు వద్దకు వచ్చి నేను ఈ ట్రంకు పెట్టెను ఇక్కడ ఉంచి భోజనం తర్వాత వచ్చి తీసుకుంటానని కోరగా వారు మావద్ద జాగా లేదని వారి కోరికను నిరాకరించారు.

ఆ తర్వాత వారు నాన్నగారి షాపు వద్దకు వచ్చి అదే విషయాన్ని నాన్నగారిని కోరగా నాన్నగారు వారి అవసరాన్ని గుర్తించి ట్రంకు పెట్టెలను తన షాపులో ఉంచుకుని, వారికి మార్వాడి వారింట్లో భోజనం ఏర్పాటు చేయడమే కాకుండా కావేటి బాలయ్య గారి సత్రంలో వసతి ఏర్పాట్లు చేయించారు. ఆ రాత్రికి మా ఇంట్లో చపాతీలు చేయించి మరీ పంపారు. ఆ తర్వాత నుండి వారు ఖమ్మం ఎప్పుడు వచ్చినా సరే చపాతీలు ఇంటి నుండే పంపేవారు. అదే వారి మొదటి పరిచయం. ఆ తర్వాత వీరిద్దరూ మంచి స్నేహితులుగా మారారు.

శ్రీ రాధేశ్యాం గారు, షాపు యజమాని పండిత భీం ప్రసాద్ మిశ్రా గారు, మరియు నాన్నగారు ముగ్గురు కలిసి ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు చర్చించుకునేవారు. వారే కాదు, కోస్తా నుండి ఏ సప్లయిదారు వచ్చినా వారి వెంట తెచ్చుకున్న లగేజిని షాపులో పెట్టుకునేవారు. వారికి తప్పకుండా టీ లు, ఇతర పానీయాలు ఇచ్చేవారు.

# ఎల్లలు దాటిన అభిమానం

నాన్నగారి పట్ల ఎంతోమంది సప్లయిదారులు వారి అభిమానాన్ని అంతే చాటుకునేవారు. కోస్తా ప్రాంత సప్లయిదారులైతే నాన్నగారు ఖరీదుకు వెళ్ళినపుడు మా షాపుకు రండంటే రండని చేతులు పట్టుకులాగే వారంటే నాన్నగారికి వారికి మధ్య సాన్నిహిత్యాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

నాన్నగారు ప్రతి సంవత్సరం మామిడికాయ పచ్చడి ఎక్కువ కాయలు పెట్టించి ముఖ్యమైన కోస్తా పార్టీలకు సీసాలలో పెట్టి పంపించేవారు. నాన్నగారి అభిమానానికి వారు ఎంతో ముచ్చటపడి పోయేవారు.

నాన్నగారి తదనంతరం ఎందరో ఆయనను కుటుంబసభ్యుడిగా భావిస్తూ కోస్తా సప్లయిదారులు నాన్నగారి ఫోటోను వారి షాపుల్లో భద్రపరుచుకున్నారు.

అలాగే బెనారస్‌లో శ్రీ రాధేశ్యాం మిశ్రా గారు నాన్నగారి పెద్దసైజు ఫోటో తయారుచేయించి మిశ్రా గారు బ్రతికున్నంత కాలం రోజూ వారి ఫోటో ముందు దీపం వెలిగించి ఆరాధించేవారంటే ఎల్లలు దాటిన వారి అభిమానం వెలకట్టలేనిది.

నాన్నగారు స్వర్గస్తులయ్యే నాటికి వారి ప్రస్తుత ఫోటోలు ఏమీ లేనందున వారు శ్రీలంక దేశానికి విదేశీయాత్రకు పాస్‌పోర్ట్ కోసం దిగిన ఫోటో మాత్రమే ఉంటే దానిని స్టూడియోలో ఎన్‌లార్జ్ చేసి మరిన్ని ఫోటో ఫ్రేములు తయారు చేయించాము. కోరుకున్న కస్టమర్లు, బంధువులు, సిబ్బంది తీసుకెళ్ళి వారిళ్ళలో భద్రపరచుకుని వారి అభిమానాన్ని చాటుకున్నారు.

# వ్యాపార నిర్వహణలో ఉద్యోగుల పాత్ర వారితో సన్నిహితత్వం -

ప్రతి వ్యాపార నిర్వహణలో వ్యాపారవేత్త తన ఉద్యోగులపై ఆధారపడి ఉంటాడు. వ్యాపారాభివృద్ధి అనేది ఉద్యోగుల సమిష్టి కృషి వల్ల సాధ్యపడుతుంది. ఈ నిర్వహణలో ఉద్యోగులకు బాధ్యతల విభజన, ప్రేరణ, ఉత్సాహంతో కలిసి పనిచెయ్యడం, మొదలైన వాటిని పెంపొందించాలి. వీటి ద్వారా అర్హతగల వారికి పని అప్పగించి వ్యాపార ప్రగతిని సాధించవచ్చు.

నాన్నగారు సిబ్బందితో చాలా సన్నిహితంగా మెలిగేవారు. తన షాపులో పనిచేసే సిబ్బందికి తగిన విధంగా శిక్షణ ఇచ్చుకుని వారి సామర్థ్యాలను వాడుకునేవారు. అప్పట్లో ఈ షాపు నుండి ఏ గుమస్తా అయినా ఏ ఇతర కారణం చేతనైనా బయటకు వెళితే ఏ మాత్రం ఆలోచించకుండా ఇతర షాపుల యాజమాన్యం వారి షాపులో నియమించుకునే వారంటే నాన్నగారి దగ్గర పనిచేసిన గుమస్తాల పని తీరుకు ఎంత విశిష్టత ఉందో అర్థం చేసుకోవచ్చు.

శ్రీ బెందడి లింగం గారి దగ్గర శిక్షణ అంటే మరీ ప్రత్యేకం అని చెప్పుకోవచ్చు. వారు అవసరమైతే దండించి మరీ పని నేర్పించి పనులు చక్కబెట్టుకునేవారు.

అలా నాన్నగారు 1969లో నన్ను, తర్వాత సోదరుడు ప్రసాదరావుని శ్రీ వీరరాఘవులు గారి వద్ద వ్యాపార విలువలు, పద్ధతులు నేర్చుకొనుటకు పంపారు. తర్వాత 1974లో సోదరుడిని కూడా వ్యాపారంలోకి తీసుకున్నారు.

సిబ్బందికి రెండు నెలల జీతాన్ని బోనస్‌గా ఇచ్చేవారు.
అప్పట్లో గుమస్తాలకు 40 రూ॥ నుండి 70 రూ॥ వరకు జీతాలు ఉండేవి.

సంవత్సరానికొకసారి జీతాలు పెంచేవారు. వారి ఇళ్ళలో జరిగే శుభాశుభ కార్యాలకు వెళ్లేవారు. వారికి కష్టాలలో సాయమందించేవారు.

ప్రతి ఆషాఢమాసంలో నాలుగు శుక్రవారాలు సిబ్బందికి మా ఇంటి యందే మా అమ్మగారిచే స్వయంగా అల్పాహారాలు తయారుచేయించి పెట్టేవారు. గుమస్తాల తల్లులకు చీరలు ఇచ్చేవారు.

వ్యాపార విభజన తర్వాత నాన్నగారు ముగ్గురు అనుభవజ్ఞులైన ఉద్యోగులను వదులుకోవాల్సి వచ్చింది. తర్వాత మరలా అంతటి సమర్థత గల సిబ్బంది లభించడం మా అదృష్టంగా భావించవచ్చు.

వారిలో మొదటివారు శ్రీ రాపోలు నర్సయ్య గారు

వీరు బెల్లంకొండ కృష్ణమూర్తి గారి షాపు నుండి వచ్చి మా వద్ద చేరారు.

వీరు ఖరీదులలో, అమ్మకంలో సిద్ధహస్తులు. అలా సేవలందిస్తూనే అకౌంట్సు విధులు నిర్వర్తించేవారు.

నాన్నగారి తదనంతరం వీరు మా శాశ్వత అకౌంటెంట్‌గా సంస్థలో స్థిరపడిపోయారు. వారు జీవించి ఉన్నంతకాలం ఒక పెద్దన్నగా మా కుటుంబ వ్యవహారాలలో, అంతా తానై చూసుకునేవారు. వారి తోడ్పాటు మా కుటుంబం ఎన్నటికి మరువలేనిది.

అలాగే మరోవ్యక్తి శ్రీ అళనె వెంకటేశ్వర్లు గారు. వీరు శ్రీ కొంకిమళ్ళ చంద్రశేఖరం గారి షాపు నుండి వచ్చారు. వీరికి సేల్స్‌లో మంచి నైపుణ్యం, ఓపిక ఉన్న వ్యక్తి. తర్వాత వీరు క్యాషియర్‌గా స్థిరపడిపోయి వారు ఆరోగ్యంగా ఉన్నంత కాలం మా సంస్థకు సేవలందించారు.

మూడవ వ్యక్తి శ్రీ చుండూరు రామారావు గారు, వీరు తెనాలి నుండి వచ్చారు. వీరు చాలా కాలం వరకు మావద్ద అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తించారు. వీరే గాకుండా శ్రీ యిరుకుమళ్ళ వీరేశలింగం గారు, శ్రీ దీకొండ రాములు గారు, శ్రీ దార్న చంద్రం గారు, శ్రీ కంభంపాటి చంద్రశేఖర్ గారు, శ్రీ గుడ్ల కన్నయ్య గారు, శ్రీ అలువాల బ్రహ్మం గారు, శ్రీ బెండడి కృష్ణ గారు, శ్రీ అలువాల సత్యనారాయణ గారు (ఇప్పటి మధు క్లాత్‌స్టోర్ యజమాని), శ్రీ బెండడి సూరయ్య గారు, శ్రీ వంగరు రామన్న గారు, ఇలా చెప్పదగిన ఉద్యోగులందరు ఆరోగ్యంగా ఉన్నంతకాలం మా సంస్థ నిర్వహణలో ఎవరికి వారు తమవంతు సహకారమందించారు.



స్టాఫ్ తో దిగిన గ్రూప్ ఫోటో



# సామాజిక కార్యకలాపాలు

సొంత లాభం కొంత మానుకు, పొరుగువారికి తోడుపడవోయి... అని ఆనాడు మహానుభావులు చెప్పిన సూక్తులు నాన్నగారిని కూడా ప్రభావితం చేసి ఉంటాయని నేను నమ్ముతాను.

ఆరోజుల్లో టెంట్‌హౌస్‌లు లేనందున శుభకార్యాలకు కావాల్సిన పెద్ద పెద్ద రాగి, ఇత్తడి సామాన్లు కొని శుభకార్యాలు జరిగే వారికి వాడుకొనుటకు లిస్ట్ వ్రాసుకుని ఇచ్చేవారు. తర్వాత వాటిని ఇంట్లో అటకమీద భద్రపరిచేవారు.

నాన్నగారు ఎక్కువగా గాంధి, నెహ్రూ ల నాయకత్వాన్ని ఇష్టపడేవారు. ప్రతి జనవరి 26, ఆగస్టు 15వ తేదీన ఖద్దరు వస్త్రాలు ధరించి జెండా వందనం చేయుటకు వెళ్లేవారు. నాన్నగారు రాజకీయంగా కాంగ్రెస్ పార్టీ అభిమాని. సమీప బంధువు శ్రీ వీరవెల్లి నర్సింహారావు గారు కాంగ్రెస్ పార్టీ నాయకులు అయినందువల్ల వారి సాయంతో ఉద్యోగాలు ఇప్పించడం, కోరిన వారికి ట్రాన్స్‌ఫర్లు చేయించడం చేసేవారు.

మా మామయ్య గారు శ్రీ పోలా నాగయ్య గారికి అప్పట్లో సర్క్యులేషన్ ఎక్కువగా ఉన్న ఆంధ్రప్రభ పత్రిక ఏజెన్సీ ఇప్పించారు.

1975లో శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి ఎదురుగా మా పెద్దనాన్న శ్రీ గుర్రం కాంతయ్య గారితో కలిసి నిర్మించిన బిల్డింగ్‌లో యూనియన్ బ్యాంక్ వారు బ్యాంక్ నిమిత్తం అద్దెకు ఇవ్వమని కోరగా, మీకు అద్దెకు ఇవ్వాలంటే బ్యాంకులో మాకు సంబందించిన వారికి ఒక ఉద్యోగం ఇవ్వాలని షరతు పెట్టి తమ షాపులో గుమస్తాగా పనిచేస్తున్న ఒకరికి ఉద్యోగం ఇప్పించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.

# మానవతా మూర్తి

మానవత్వమనేది మాటల్లో కాదు, అది చేతల్లో కనబడుతుందని ఎప్పుడూ చెప్పేవారు. అలా చెప్పడమే కాదు ఒక అనాద అయిన 50 సంవత్సరాల వయస్సు గల మూగవ్యక్తిని చేరదీసి ఇంట్లో ఉంచుకుని అతనికి, తిండి, బట్ట, వసతి కల్పించారు.

ఆయన మనం చేసే సైగల ద్వారా ఏ పనిచెప్పినా చక్కగా చేసేవారు. సరుకులు చీటి వ్రాసి ఇస్తే కిరాణం షాపుకి వెళ్ళి సరుకులు తెచ్చిపెట్టేవాడు.

10 సంవత్సరాల తర్వాత అతను అనారోగ్యంతో మరణిస్తే అతనికి దహన సంస్కారాలు పూర్తి చేయించి తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు.

అలాగే ఆ రోజుల్లో పేద కుటుంబంలోని పిల్లలు చదువుకోవాలంటే ఆర్థిక స్తోమత లేని కారణంగా వారు వారంలో ఒకరోజు చొప్పున అందరి ఇళ్ళల్లో భోజనం అర్థించేవారు. అటువంటి వారిని వారాలబ్బాయి అనేవారు. అలా మా వంతు వచ్చేరోజున వారికి చక్కగా భోజన ఏర్పాట్లు చేసేవారు. అంతేగాక వారికి తనకు తోచినంత ఆర్థిక సాయమందించేవారు.

# పరుల సొమ్ము పాము వంటిది

తనదైనది తనకు దక్కకపోయినా పర్వాలేదు కాని తనది కాని దానికి ఏనాడూ ఆశపడని వ్యక్తిత్వం నాన్నగారిది.

ఎవరైనా మోతుబరి రైతులు పంటలు అమ్మినపుడు వారి మిగులు డబ్బులను నాన్నగారిపై వారికున్న నమ్మకాన్ని బట్టి మీ దగ్గర జమ ఉంచమని బలవంతపెట్టేవారు. నాన్నగారు నేను డబ్బులు డిపాజిట్‌గా తీసుకోను, మీ పేరున పొట్లం కట్టి బీరువాలో అలాగే ఉంచుతానని అలాగే ఉంచి తిరిగి వారి అవసరాల కోసం ఇచ్చేవారే కానీ ఏనాడు వాటిని తన స్వంత అవసరాలకు వాడుకోలేదు.

నేను ఒకసారి నాన్నగారిని అడిగాను, అవసరం వచ్చినపుడు వాడుకుని తిరిగి మరలా సర్దుబాటు చేయవచ్చు కదా అని, అపుడు నాన్నగారు పరాయి సొమ్ము పాముతో సమానమని నిజాయితీతో కూడిన సమాధానమిచ్చారు.

అయితే బంధువులు, ఇతరులు ఆ నమ్మకాన్ని నాన్నగారు జీవించి ఉన్నంతవరకే నిలబెట్టుకున్నారు. నాన్నగారు పరమపదించిన నెలరోజుల్లోపే వెంకటేశ్వర్లు గారి కుటుంబానికి అప్పులున్నాయని, వారి కుటుంబ సభ్యులు ఇప్పుడు అప్పులు తీర్చలేని పరిస్థితిలో ఉన్నారని తప్పుగా భావించి నాన్నగారి వద్ద బలవంతంగా జమ ఉంచిన బంధువులు అందరూ వారి జమలను తీసుకెళ్ళిపోయి మానవ నైజాన్ని ప్రదర్శించారు.

# వివాద రహితుడు

నాన్నగారు వివాదాలకు సాధ్యమైనంత దూరంగా ఉండేవారు. చాలా మృదు స్వభావి. మరియు భయస్తులు కూడాను. దీనికి సంబంధించి ఒకటి రెండు సంఘటనలు మీకు చెప్పదలచుకున్నాను.

ఒకసారి కస్టమర్ బట్టలు ఖరీదు చేసుకుని వారి బంధువుల ఇంట్లో రాత్రి బస చేశారు. ఆ ఇంటి యజమానురాలు ఎవరికి తెలియకుండా వారి బట్టల పొట్లం తీసి వారు కొన్నటువంటి కేస్‌మెంటు 4.00 మీటర్ల క్లాత్ నుండి 1.00 మీటరు క్లాత్‌ను చాకుతో కట్‌చేసి తీసుకున్నది. కస్టమర్ ఇంటికి వెళ్ళి చూసుకోగా 1.00 మీటరు క్లాత్ తక్కువగా ఉన్నది. దానికి వారు కమ్యూనిస్ట్ పార్టీ లీడర్ పల్లా జాన్ రాములు గారిని వెంట తీసుకవచ్చి షాపు వద్ద పెద్ద గొడవ చేశారు. ఆ సందర్భంలో నాన్నగారు పొరపాటు జరిగిందని, తప్పు తనమీద వేసుకుని 1.00 మీటరు గుడ్డ ఇచ్చివేసి గొడవను సద్దుమణిగించారు.

తర్వాత ఆ కస్టమర్ అసలు నిజాన్ని తెలుసుకుని షాపుకి వచ్చి క్షమాపణలు చెప్పకున్నారు. అప్పటి నుండి కస్టమర్ కొన్న ప్రతి వస్తువు రేటు, మీటర్ల కొలత, బిల్లు చెక్ చేయించి మరీ ప్యాకింగ్ చేయించేవారు. అప్పటి నుండే చెకింగ్ విధానం అమలులోకి వచ్చి నేటికి కొనసాగుచున్నది.

మరో సంఘటనలో విజయవాడ వ్యాపారి ఖరీదు బిల్లులో అసోసియేషన్ రుసుమును కలిపి పంపారు. సాధారణంగా అలాంటి రుసుములను తగ్గించి పేమెంట్లు పంపుతుంటారు. అలా తగ్గించి పంపినందుకు ఆ వ్యాపారి తగ్గించడం కుదరదని చెప్పకుండా నేరుగా లాయర్ నోటీస్ పంపారు. మరుసటి రోజే నాన్నగారు స్వయంగా విజయవాడ వెళ్ళి ఆ వ్యాపారానికి చెల్లించాల్సిన తేడా మొత్తమును చెల్లించి వచ్చారు.

**ఈసారి మరో విచిత్రమైన సంఘటన మీకు వివరిస్తాను..**

ఒక పల్లెటూరి రైతు తనదగ్గరున్న వెండి నాణేలు అమ్మి పెట్టమని నాన్నగారిని కోరగా, నాన్నగారు బంగారం వ్యాపారి శ్రీ కర్నాటి శ్రీరాములు గారికి విషయం తెలియపర్చారు. వారు ఆ రైతును తన దగ్గరకు తీసుకరమ్మని చెప్పగా నాన్నగారు ఆ రైతును వెంటబెట్టుకుని బయలుదేరుచుండగా, ఎదురుగా ఉన్న బంగారం వ్యాపారి శ్రీ బాలాజి గోవిందనారాయణ గారు అదే రేటు నేను చెల్లిస్తాను, నాకు అమ్మిపెట్టమని కోరారు. ఎవరికైతే ఏముందని నాన్నగారు వారికి బేరం అప్పజెప్పారు. ఇది తెలుసుకున్న శ్రీరాములు గారు జరిగిన దానిని మనసులో ఉంచుకుని ఒకనాడు నాన్నగారి షాపుకి వచ్చి వస్త్రాలు కొనుక్కుని, నేను ఈ వస్త్రాలకు డబ్బులు చెల్లించను, మీరు నాకు ఇప్పిస్తానన్న వెండి నాణేలు వేరే వారికి ఇప్పించారు. దానివల్ల నాకు రావలసిన లాభాన్ని నేను నీవల్ల కోల్పోయానని ఆ లాభానికి సరిపడా వస్త్రాలు బిల్లు కట్టకుండా తీసుకెళ్ళిపోయారు. జరిగిన దానికి నాన్నగారు వారితో గొడవపడకుండా మిన్నకుండిపోయారు.

# దిన చర్య

నాన్నగారు ప్రతిరోజు ఉదయం 5.00 గం॥కు నిద్రలేచేవారు. ఆంధ్రప్రభ దినపత్రిక చదివి, రేడియోలో ఆకాశవాణి వార్తలు వినడం వారి దినచర్యలో ఒక భాగం. స్నానాధికాలు ముగించుకుని దైవారాధన చేసేవారు. 7.30గం॥ వరకు అల్పాహారం భుజించి బయలుదేరి శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి గుళ్ళలో దైవ దర్శనాలు చేసుకుని 8.00గం॥కు షాపు తీసేవారు.

తెల్లని కమీజు, పంచెకట్టుతో హుందాగా ఉండేవారు. మద్యాహ్నం 1.00గం॥కు భోజనానికి వెళ్లేవారు. నేలమీద పీట వేసుకుని దానిపై కూర్చుని మాత్రమే భోజనం చేసేవారు. భోజనం చేసిన తర్వాత ఎటువంటి విశ్రాంతి తీసుకునేవారు కారు.

సాయంత్రం 4.00గం॥కు ఇంటి నుండి టీ తెప్పించుకుని త్రాగేవారు. రాత్రి 8.30గం॥కు శ్రీ గుడ్ల వీరరాఘవులు గారు బ్రాంచి లెక్కలు ముగించుకుని వచ్చిన తర్వాత 9.00గం॥కు షాపు మూసేవారు. షాపు మూసిన తర్వాత ముగ్గురు భాగస్తులు కలిసి అటు ప్రక్కన శ్రీ వీరరాఘవులు గారు, ఇటు ప్రక్కన శ్రీ బెందడి లింగం గారు మధ్యలో నాన్నగారు నడుచుకుంటూ ఇంటి దాకా వచ్చేవారు. వారి వెంట సైకిళ్ళతో నడుచుకుంటూ గుమస్తాలు అందరూ ఇంటి దాకా వారిని అనుసరించేవారు. తర్వాత ఎటువారు అటు వెళ్ళిపోయేవారు. ఈ దృశ్యం చూడటానికి కనులనిండుగా ఉండేది.



# దైవ భక్తి

నాన్నగారు దైవభక్తి మెండుగా కలవారు. శ్రీ వెంకటేశ్వరస్వామిని ఎక్కువగా పూజించేవారు. వారి ఇష్ట దైవాలను దర్శించుకున్న తర్వాతనే రోజువారి కార్యకలాపాలు మొదలెట్టేవారు.

ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేవారు. అప్పుడప్పుడు ఇంట్లో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేయించేవారు.

కన్యాకుమారి నుండి బదరి కేదారినాథ్ వరకు దాదాపు అన్ని పుణ్య క్షేత్రాలు దర్శించుకున్నారు. కాని ఒక్క శ్రీశైల పుణ్యక్షేత్రం మాత్రం దర్శించుకోలేక పోయారు.

ముఫర్జు పుస్తకంలోని మొదటి పేజిలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఖాతాకు కొంత నగదును జమ కట్టేవారు. అట్టి నగదును అవసరమైనపుడు ఖర్చు వ్రాస్తూ దైవ కార్యాలకు వినియోగించేవారు.

వినాయక చవితికి పాత బజార్‌లో మట్టి విగ్రహాలు రెండు అడుగుల ఎత్తుతో తయారుచేయించి పూజ చేయించేవారు. మా పిల్లలకు స్వయంగా పంచెలు కట్టించి, నామాలు పెట్టించి, వినాయక స్తోత్రాలు చేయించేవారు. భద్రాచలంలో అన్నప్రాసన, తిరుపతిలో పుట్టు వెంట్రుకలు తీయించారు.

చెరువుబజార్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా జరిపించి, అన్నదానం చేసేవారు. వారు జీవించి ఉన్నంతకాలం ఆ స్వామి పేరుతో ఒక చీటి నిర్వహించి దానిపై వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగించేవారు. దేవాలయాలకు, ధర్మకార్యాలకు విరివిగా విరాళాలు ఇచ్చేవారు.

ఇంత దైవభక్తి ఉన్నా నాన్నగారు తిథి, వారాలు, శకునాలు అంతగా పట్టించుకునేవారు కాదు. కట్టుబడి పనులు, ఇతర పనులు ఏవైనా ప్రారంభించాలంటే అమావాస్య రోజున శ్రీ బెందడి లింగం గారితో మొదట గడ్డపారతో తవ్వించి మొదలుపెట్టేవారు.

అలాగే ఖరీదుకు వెళ్లేటపుడు అమావాస్య రోజునే బయలుదేరేవారు. మంచి పనులు చేయడానికి ముహూర్తాలు చూడాల్సిన అవసరం లేదనేవారు. అంకెలలో ఎక్కువగా 57 సంఖ్య అంటే ఎక్కువగా ఇష్టపడేవారు. టెలిఫోన్ నంబర్లు చివర్లో 57 వచ్చే విధంగా చూసుకునేవారు. అదే సాంప్రదాయం నేటికి కొనసాగడం విశేషం.


శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానము
చెరువు బజార్, ఖమ్మం.

# అయినవారితో అనుబంధాలు

నాన్నగారు ప్రతి సంవత్సరం ఆషాఢమాసంలో వారి జన్మస్థలమైన చంద్రుపట్ల గ్రామానికి కుటుంబ సభ్యులందరిని తీసుకెళ్ళి వారం రోజులపాటు గడిపేవారు. మా పెద్దనాన్నల కుటుంబంలోని ప్రతి ఒక్కరికి వస్త్రాలు, పండ్లు ఇచ్చేవారు. ఆ ఊరిలో ఉన్న బంధువులు, స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి వారిని పేరు పేరునా పలకరించి వచ్చేవారు. వారు మా వెంకయ్య గారు వచ్చారని సంతోషపడేవారు.

మా పెద్దనాన్న శ్రీరాములు గారి అమ్మాయి శ్రీమతి లక్ష్మినర్సమ్మ గారి ఇంటికి వెళ్ళి ఈ వారం రోజుల్లో ఒకరోజు తప్పక గడిపేవారు. మా ఇద్దరు పెద్దనాన్నలు నాన్నగారి సలహాలు తప్పక పాటించేవారు. వారి పిల్లల వివాహ విషయంలో కట్నకానుకలు మాట్లాడి దగ్గరుండి వివాహం జరిపించేవారు. మా చిన్న పెద్దనాన్న గారి ఒక అమ్మాయికి కాళ్ళు కడిగి కాన్యదానం చేశారు. మా అక్కయ్యలు వైద్యం మరియు పురుడు నిమిత్తం ఖమ్మం వస్తే ఇంట్లో ఉంచుకుని వారికి కావలసిన ఏర్పాట్లు చూసుకుని బట్టలు పెట్టి పంపేవారు.

మా పెద్దనాన్న శ్రీ కాంతయ్య గారు అప్పుడప్పుడు నగదు చే బదులుగా తీసుకుని వెళ్ళేవారు. వాటిని నాన్నగారు ఎక్కడా వ్రాసుకునేవారు కాదు. మరల వారే స్వయంగా తెచ్చి ఇచ్చేవారు.

మా నాయనమ్మ శ్రీమతి వెంకమ్మ గారు పట్టణంలో నాన్నగారి దగ్గర ఉండుటకు అంగీకరించక స్వగ్రామమైన చంద్రుపట్లలోనే నివసించేవారు. ప్రతి సంవత్సరం నాయనమ్మ గారిని ఖమ్మం తీసుకవచ్చి ఆమెకు వైద్యం చేయించి చీరలు, డబ్బులు ఇచ్చి పంపేవారు.

నాన్నగారు మా నాయనమ్మకు బంగారు గాజులు కూడా చేయించి ఇచ్చారు. తన ముగ్గురు కుమారులలో చిన్నవాడైన నాన్నగారంటేనే ఆమెకు ఎక్కువ ప్రేమ.

మా నాయనమ్మ గారు నాన్నగారు చనిపోయాక, కొడుకు చనిపోయాడన్న దిగులుతో 20 రోజుల తర్వాత ఆమె కూడా స్వర్గస్తులయ్యారు. నాన్నగారి పెద్దమామ గారి కుమారుడు శ్రీ బుచ్చయ్య గారిని షాపులో ఉంచుకుని ఆదరించారు.

తోటి వ్యాపారస్తులు శ్రీ పెరుమాళ్ళ నాగేశ్వరరావు గారు, శ్రీ గెల్లా లక్ష్మీనారాయణ గారి వంటి వారితో దేవాలయాలలో కలుసుకున్నప్పుడు ప్రేమ పూర్వకంగా మాట్లాడుకునేవారు.

# విహార యాత్రలు

వివిధ ప్రాంతాల సందర్శన మానవునికి మేధోవికాసం, మానసిక చైతన్యాన్ని కలిగిస్తుంది. చారిత్రక స్థలాలు దర్శించడం ద్వారా ఆనాటి జీవన విధానం, సామాజిక స్థితిగతులు, చరిత్ర, సంస్కృతి మొదలైన వాటి గురించి మనకు తెలుస్తాయి.

నాన్నగారు ఎక్కువగా పుణ్యక్షేత్రాలను సందర్శించేవారు. ఒకసారి నాన్నగారు, వారి భాగస్తులు మరియు స్నేహితులతో కలిసి అప్పట్లో శ్రీలంక దేశానికి టూర్ వెళ్ళడం విశేషం. అంతేగాక ఆ టూర్‌లో మా అత్తమామలను కూడా తీసుకెళ్ళారు.

మరోసారి ఉత్తర దేశ యాత్రకు వెళ్ళినపుడు భాగస్తుడు శ్రీ బెందడి లింగం గారి కుటుంబాన్ని మరియు శ్రీ వీర రాఘవులు గారి తల్లి శ్రీమతి నాగమ్మ గారిని, మా గుమస్తా శ్రీ రామచంద్రం గారి తల్లిని, మా చిన్న సోదరుడు ఉమా మహేశ్వరరావును, చెల్లెలు పద్మావతి దేవిని, వెంట తీసుకుని వెళ్ళి వచ్చారు. అప్పుడు నాకోసం నాన్నగారు బ్రీఫ్‌కేస్ మోడల్‌లో ఉన్న ఒక టేప్ రికార్డర్ తీసుకొచ్చారు.

# జీవితం నేర్పిన పాఠాలు

**ఎవరికి జమానతు ఉండరాదు -**

జమానతు ఉండటమంటే అవతలి వారు చెల్లించలేని పరిస్థితి వచ్చినపుడు ఆ నష్టాన్ని జమానతుగా ఉన్నవారు చెల్లించాల్సి ఉంటుంది. అలాంటిదే ఒక ఉదాహరణ మీకు చెప్పుతాను.

సమీప బంధువు అయిన కె.ఎస్.మల్లిఖార్జున్ గారికి హన్మకొండలో వస్త్ర దుకాణం ప్రారంభిస్తుంటే సప్లయిదారుల వద్ద తాను జమానతుగా ఉండి వస్త్రాలు ఇప్పించారు. కొంతకాలం తర్వాత వారి వ్యాపారం దివాలా తీస్తే నాన్నగారు కొంత స్టాకు తీసుకుని, కొంత మొత్తాన్ని సప్లయిదారులకు చెల్లించి నష్టపోయారు.

**ఏ చిట్‌ఫండ్ కంపెనీలో చీటీలు కట్టరాదు -**

సికింద్రాబాద్‌లో ఓ పెద్ద వ్యాపారి చిట్‌ఫండ్ కంపెని నిర్వహించేవారు. ఆ కంపెనీలో నాన్నగారి పరిచయస్తులు సోమా వెంకటేశం గారు భాగస్తులుగా ఉండేవారు. వారిని నమ్మి నాన్నగారు దానిలో చిట్టీ కట్టారు. ఆ సంస్థ ఆర్థికంగా దెబ్బతిన్న కారణంగా నాన్నగారు దాచుకున్న సొమ్మంతా నష్టపోయారు. కాని మేము వారు చెప్పిన పాఠాన్ని పెడచెవిన పెడుతూ సమీప బంధువుల చిట్‌ఫండ్ కంపెనీలో చిట్టీలు కట్టి మేము కూడా నష్టపోవలసి వచ్చింది.

**ఎవరి దగ్గర అప్పులు తేవడం గాని, ఎవరికి అప్పులు ఇవ్వడం గాని చేయరాదు -**

నాన్నగారు వ్యాపారంలో చిన్న చిన్న అప్పులు తప్ప పెద్దమొత్తంలో అప్పులు తేవడం కాని, ఇవ్వడం గాని చేసేవారు కారు. చిన్నమొత్తంలో ఇస్తున్నప్పుడు ఈ డబ్బు రాదని భావించే ఇచ్చేవారు. దాదాపు అలాంటి పద్దులేవి తిరిగి రాలేదు.

ఒకసారి నాన్నగారు నాకు 4000/- రూ॥ ఇచ్చి అనుభవం కోసం వడ్డీలకు తిప్పమన్నారు. ఆ డబ్బులు వడ్డీలకు ఇచ్చి తిరిగి వసూలు చేయలేక పోగొట్టుకున్నాను. అప్పుడు నాన్నగారు నాతో ఇలా అన్నారు. మన కుటుంబీకులకు గట్టిగా వసూలు చేయడం చేతకాదు. కాబట్టి ఎవ్వరికి అప్పులు ఇవ్వవద్దని చెప్పారు. అప్పులు తేవడం కూడా వారికి ఇష్టం ఉండేది కాదు.



ముగ్గురు భాగస్వాముల పిల్లల చిన్ననాటి ఫోటో

# కుటుంబం

కాలాలు మారినా, ఏండ్లు గడిచినా భారతదేశంలో ఇప్పటికి కుటుంబ వ్యవస్థ నిలిచి ఉన్నది. అందరి సుఖంలో నా సుఖం ఉన్నది. వారి కోసమే నా జీవితం అనే భావన భారతీయ కుటుంబానికి ప్రాతిపదిక. అమ్మా నాన్నలు, అక్కా చెల్లెళ్ళు, అన్నా తమ్ముళ్ళు, తాతయ్య, నాయనమ్మ ఇదే కుటుంబం. ఇదే సుఖ సంతోషాల వాకిలి, ఆనందాల లోగిలి. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యల ఒడిలో ఒదిగిపోవడం, చిన్న పిల్లలకైతే మహా సరదా. వారికి ఆత్మీయంగా సేవలు చేసి దీవెనలు పొందాలి. పిల్లలు పరస్పరం అభిమానాన్ని, ఆప్యాయతను పంచుకుంటూ సేవాభావంతో ఉండాలి.

నాన్నగారికి 1944వ సంవత్సరంలో మా అమ్మ లీలావతి గారితో వివాహం జరిగింది.
ఆ పుణ్య దంపతులకు మేము ఆరుగురం సంతానం.

| | |
|---|---|
| మొదటి సంతానంగా | 1950 సం॥లో అన్నయ్య రామారావు గారు |
| | 1954 సం॥లో నేను (నర్సింహారావు) జన్మించాము |
| | 1957 సం॥లో మొదటి తమ్ముడు ప్రసాదరావు |
| | 1960 సం॥లో రెండవ తమ్ముడు అశోక్ కుమార్ జన్మించారు |

వరుసగా నలుగురం మగపిల్లలే పుట్టినందువల్ల ఈసారి ఆడపిల్ల పుడితే తనకి “పద్మావతి దేవి” అని పేరు పెట్టుకుంటానని అలివేలు మంగాపురంలో మ్రొక్కుకున్నారు.
అలా 1963 సం॥లో పద్మావతి దేవియే తన కడుపున పుట్టినట్టుగా కవల పిల్లలుగా మూడవ తమ్ముడు ఉమా మహేశ్వరరావు, చెల్లెలు పద్మావతి దేవి జన్మించారు.

తనకు నలుగురు పిల్లల తర్వాత తన భార్య గర్భంలో కవల పిల్లలు ఉన్నారని తెలిసి పెద్ద ఆపరేషన్ చేయించవలసి వచ్చినపుడు. ఖమ్మం మిషన్ ఆసుపత్రిలో అమెరికన్ డాక్టర్‌తో మొదటి పెద్ద ఆపరేషన్ చేయించారు.

అప్పుడు హాస్పిటల్‌లో డాక్టర్లకు, సిస్టర్స్‌కు వస్త్రాలు ఇచ్చి, హాస్పిటల్ మొత్తానికి బెడ్‌షీట్లు ఇచ్చి తన సంతోషాన్ని పంచుకున్నారు.

అన్నయ్య రామారావు గారిని రాముడూ, పెద్దోడా అని, నన్ను చిన్నోడ, ఎర్రోడ, లక్ష్మి అని, తమ్ముడు ప్రసాదరావుని నల్లోడ అని, అశోక్ కుమార్ ని బక్కోడ అని
ఉమా మహేశ్వరరావుని పొట్టోడ అని ముద్దుగా పిలుచుకునేవారు.
చెల్లెలు పద్మావతి దేవిని దేవి, అమ్మా అని పిలుచుకునేవారు. తనని అల్లారు ముద్దుగ పెంచుకుని చదువుతో పాటు వీణ కూడా నేర్పించారు. ఆడపిల్లల మీద ప్రేమతో నన్ను కూడా ఆడపిల్లలాగ అలంకరించి తృప్తి పడేవారు.

నిజాంపేట బజార్‌లో మా మామయ్య గారు శ్రీ పోలా నాగయ్య గారింట్లో మోమినాన్ స్కూల్ హెడ్ మాస్టర్ గా పనిచేస్తున్న శ్రీ పిల్లలమర్రి ముక్తేశ్వరరావు గారు అద్దెకు ఉండేవారు. వారికి అప్పటికి సంతానం లేనందున మా అన్నయ్య రామారావు గారిని ప్రేమగా చూసుకునేవారు. అన్నయ్య గారు ఎక్కువగా వారింట్లోనే గడిపేవారు. ఇంటి దగ్గరే స్కూలు ఉన్నందున అన్నయ్య గారిని తన భుజాలపై ఎక్కించుకుని మరీ స్కూలుకి తీసుకుని వెళ్లేవారు.

నాన్నగారు ఆదివారం సాయంత్రం మమ్ములను తీసుకుని మోహన్ స్వీటు షాపు హోటల్‌కి తీసుకెళ్ళేవారు. గుడికి గాని, బస్టాండ్ దగ్గర పార్కుకి గాని, సినిమాకు గాని తీసుకెళ్ళేవారు. అప్పుడు అందరం రిక్షాలపై వెళ్ళేవారము.

మమ్ములను అందరిని ఒకసారి హైదరాబాద్ తీసుకెళ్ళి చల్లారామ్స్ వారి కారుని అడిగి తీసుకుని ఊరంతా చూపించి యాదగిరిగుట్టకు తీసుకొని వెళ్ళారు. మాకు ఏం కావాలన్నా నాన్నగారే స్వయంగా వచ్చి ఇప్పించేవారు. దీపావళికి ఫ్యాషన్ హాల్‌కు తీసుకెళ్ళి చెప్పులు, బూట్లు ఇప్పించేవారు. అలాగే క్యారంబోర్డు, షటిల్ బ్యాట్లు, వాలిబాల్, ఫుట్‌బాల్ మొదలగునవి ఇప్పించేవారు. బుక్‌స్టాల్‌కు కూడా తానే వచ్చి అందరికి కావలసిన పుస్తకాలు, నోట్‌బుక్స్ ఇప్పించేవారు.

నాన్నగారు మమ్మల్ని చాలా ప్రేమగా పెంచారు. మాకు విద్యాబుద్ధులు మొదట రాజేంద్రనగర్ స్కూలు నందు నేర్పించారు.

అప్పుడు మాకు శ్రీ కొత్తా రంగారావు గారని హెడ్‌మాస్టర్‌గా పనిచేసేవారు. మాకు మధ్యాహ్న భోజనం మా హెడ్‌మాస్టర్ గారి ఇంటికి పంపి అక్కడే తినుటకు ఏర్పాటు చేయించారు. హెడ్‌మాస్టర్ గారి భార్య శ్రీమతి రాజేశ్వరి గారు మమ్మల్ని తల్లిలా చూసుకునేవారు. మా ఇంటి నుండి వచ్చిన భోజన పదార్ధాలతో పాటు వారి ఇంట్లో ఉన్న పదార్ధాలు కూడా కలిపి వడ్డించేవారు.

నాన్నగారు మాకు ఆరో తరగతి నుంచి ఇంటి వద్దే ట్యూషన్ ఏర్పాటు చేయించారు. పెరిగి పెద్దవారము అయ్యాం గాని విద్యాబుద్ధులు అంతగా అబ్బలేదు.

1973లో మా పెద్దనాన్న శ్రీ గుర్రం కాంతయ్య గారితో కలిసి మిర్చి స్టాకు పెట్టి అమ్మగా వచ్చిన లాభంతో మాకు జావా మోటారు సైకిల్ కొని పెట్టారు. ఇదే మోటారు సైకిల్‌పై నాన్నగారిని తమ్ముడు ప్రసాదరావు తిప్పేవాడు.

1967 సం॥లో మా అన్నయ్య శ్రీ రామారావు గారికి కోయచలక గ్రామస్తులు శ్రీ మైలవరపు లింగయ్య గారి నాల్గవ కుమార్తె వీరలక్ష్మి గారిని ఇచ్చి వివాహం జరిపించారు.

1969 సంవత్సరంలో నా వివాహం పెద్ద మునగాల గ్రామస్తులు శ్రీ కొదుమూరి జగన్నాధం గారి నాల్గవ కుమార్తె లక్ష్మితో జరిపించారు.

1974లో తమ్ముడు ప్రసాదరావు వివాహం మహబూబాబాద్ వాస్తవ్యులు శ్రీ ఒబిలిశెట్టి వెంకటనారాయణ గారి ప్రధమ కుమార్తె అనసూర్య (సుమతి)తో జరిపించారు.

1974లోనే చెల్లెలు పద్మావతి దేవికి ఖమ్మం వాస్తవ్యులు శ్రీ చెరుకూరి రామకోటి గారి కుమారుడు శ్రీ వెంకట రామారావు గారితో వివాహం చేయుటకు నిశ్చయించుకుని కట్నకానుకలు మాట్లాడుకున్నారు. తమ్ముడు ప్రసాదరావు వివాహంతో పాటు చెల్లెలు వివాహం కూడా చేయాలనుకున్నారు నాన్నగారు. కాని వరుడి నాయనమ్మ గారు చనిపోయి నందున పెళ్లి వాయిదా పడినది.

ఉన్న బజారులోనే కాబోయే అల్లుడి గారి ఇల్లు ఉన్నందున నేను వారి ఇంటి ముందు నుండే వెళతాను కాబట్టి రోజూ పండ్లు, మిఠాయిలు ఇస్తానని మా చెల్లెలితో చెపుతూ మురిసిపోయేవారు. ఆ కోరిక తీరకుండానే పెండ్లికి ముందే స్వర్గస్తులయ్యారు.

1975లో నాన్నగారి తదనంతరం రెండు నెలల తర్వాత మా చెల్లెలి వివాహం మేము జరిపించాము.

# కుటుంబ సభ్యుల బాగోగులు

నాన్నగారు కుటుంబ సభ్యుల అందరి బాగోగులు తానే చూసుకునేవారు. అంతేగాక వారి ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ చూపేవారు. మా పెద్దనాన్న గార్ల పిల్లలకు కూడా దగ్గరుండి వైద్యం చేయించి పంపేవారు. మా నాయనమ్మ గారిని కూడా అంతే జాగ్రత్తగా చూసుకునేవారు.

ఒకసారి తన పెద్దకోడలు వీరలక్ష్మి గారి నోటిలో పై అంగిలికి కురుపు అయి దానిని పూర్తిగా తొలగించి దాని స్థానంలో కృత్రిమంగా అంగిలి ఏర్పాటు చేయవలసి వచ్చినపుడు హైదరాబాద్ కోఠిలో ENT హాస్పిటల్‌లో వారం రోజుల పాటు దగ్గరుండి అట్టి అరుదైన ఆపరేషన్ చేయించారు.

# మనవలు, మనవరాలంటే ప్రేమ

1972 సంవత్సరంలో నా ప్రధమ కుమారుడు మురళికృష్ణ జన్మించినపుడు అర్ధరాత్రి వచ్చి శేటుగారు మీరు “తాతయ్య” అయ్యారు అని తెలియపర్చిన గుమస్తాకు పట్టరాని సంతోషంతో తన చేతికున్న బంగారపు ఉంగరాన్ని తీసి బహుమానంగా ఇచ్చారు. కాని శిశువు కేవలం 2.5 పౌండ్ల  బరువుతోనే జన్మించాడు.  మా దంపతులకు చిన్న వయస్సు అయినందున అతని ఆలన, పాలన మా అమ్మగారు చూసుకునేవారు.

1973 సంవత్సరంలో మా అన్నయ్య శ్రీ రామారావు గారికి కుమార్తె సుధారాణి జన్మించింది. నాన్నగారి సంతానానికి కలిగిన మొదటి ఆడపిల్ల అయినందువల్ల చాలా ప్రేమగా చూసుకునేవారు.

అదే సంవత్సరంలో నాకు నా రెండవ కుమారుడు మల్లిఖార్జున్ జన్మించాడు. పిల్లలను తన గదిలోనే నిద్రపుచ్చుకోవడం అలవాటు. నాన్నగారు చనిపోయేముందు చివరి రాత్రి సుధారాణిని తన గుండెలపై నిద్రపుచ్చుకున్నారు. చనిపోయేనాటికి తమ్ముడు ప్రసాదరావు భార్య గర్భవతి.

మురళికృష్ణ బారసాలకు మురుగులు, తోడాలు, బంగారు మొలతాడు మరియు గొలుసు చేయించారు. సుధారాణి బారసాలకు మామిడి పిందెల డిజైన్‌తో సిగ్గుబిళ్ళ, గొలుసు, బంగారు గాజులు చేయించారు.



శ్రీమతి గుర్రం లీలావతి గారు

# సహ ధర్మచారిణి

ఎవరి స్థానం వారిది,
ఏ ఒక్కరిని మరొకరితో పోల్చకూడదు
ఎవరి గొప్పతనం వారిది, ఎవరి ప్రేమ వారిది
వారితో మన ప్రపంచం గొప్పది
అమ్మ లీలావతి ప్రేమ మూర్తి

వ్యాపారం నాన్నగారు చూసుకుంటే కుటుంబ వ్యవహారాలు అమ్మగారు చూసుకునే వారు. మా అందరిపై సమానంగా ప్రేమను చూపేవారు. కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేవారు.

వీరు దయగల ఇల్లాలు. చేతికి ఎముక లేకుండా దాన ధర్మాలు చేసేవారు. బంధువులకు, ఇతరులకు వస్త్రాలు ఇచ్చేవారు. దైవ భక్తురాలుగా శ్రీ గణపతి సశ్చిదానంద స్వామి వారిని ఆరాధించేవారు.

అప్పట్లో కస్టమర్లు ఎవరైన ఇంట్లో బస చేయాల్సిన సందర్భంలో వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేవారు. వైద్య సేవలకోసం బందువులు ఖమ్మం వచ్చినపుడు వారిని హాస్పిటల్‌కు తీసుకెళ్ళి వైద్యం చేయించేవారు. పురుడు, పుణ్యవచనాలు చేసేవారు.

బంధువుల అమ్మాయిలు చుట్టపు చూపుగా మా యింటికి వచ్చినపుడు వారికి తాత్కాలికంగా తన నగలను ధరింపజేసి వారు పడుచున్న ఆనందాన్ని చూసి తనూ ఆనందపడేవారు.

నాన్నగారి తదనంతరం మా వివాహాలు జరిపించి మనవలు, మనవరాళ్ళతో వారి శేష జీవితాన్ని గడుపుచూ 1997 సం॥లో స్వర్గస్తులయ్యారు.

# ఆఖరి అంకం

1974వ సంవత్సరం దీపావళి రోజున విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా నాన్నగారి కాలికి గాజుపెంకు గుచ్చుకుని రక్తస్రావంతో గాయమైంది. అది కాలక్రమేణ మానకపోగా సెప్టిక్‌గా తయారైంది. నాన్నగారికి రోజూ వైద్యుడు ఇంటికి వచ్చి వైద్యం చేస్తుంటే ఇన్‌ఫెక్షన్ కారణంగా విపరీతమైన బాధను అనుభవించేవారు. కాలికి కట్టు కట్టుకుని అలాగే షాపుకి వచ్చేవారు.

ఆ తర్వాత ఒకరోజు నాన్నగారికి గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులం ఎంత బలవంతపెట్టినా హైదరాబాద్ వెళ్ళి వైద్యం చేయించు కొనుటకు నిరాకరించి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి వైద్యం చేయించు కున్నారు. ఆ తర్వాత కొన్ని నెలల కాలం పాటు సాధారణంగానే తన కార్య కలాపాలు నిర్వహించుకున్నారు.

## 12/04/1975

అది ఉగాది పర్వదినం. ఎప్పటిలాగానే షాపుకు వచ్చి విధులు నిర్వర్తించారు. సాయంత్రం శ్రీ వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళి పంచాంగ శ్రవణం విన్నారు. రాత్రి 11.00గం॥ వరకు భాగస్తుడు శ్రీ వీర రాఘవులు గారు మరియు మా మామయ్య శ్రీ పోలా నాగయ్య గారితో మాట్లాడుతూ గడిపారు. ఆ రాత్రి 11.00 గం॥కు రెండవసారి మరలా గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచి శాశ్వతంగా ఈ లోకాన్ని వదిలి మా నుండి దూరమయ్యారు.

నేను అదే పండుగ రోజున భార్యా, పిల్లలతో అత్తగారింటికి వెళ్ళాను. ఆ రాత్రి నాన్నగారు గుండెపోటుతో చనిపోయారన్న కబురు బయటకు రాని కన్నీటితో నా గుండె బరువెక్కేలా చేసింది. రాత్రికి రాత్రే బయలుదేరి ఇంటికి చేరుకున్నాను.

ఊహించని హఠాత్పరిణామానికి మా కుటుంబమంతా ఆ దేవుని నిందిస్తూ శోకసంద్రంలో మునిగి పోయింది.

# చివరి మజిలి

వస్త్ర వ్యాపారంలో ఎటువంటి అనుభవం లేకుండా, భాగస్తుల సహకారం తీసుకుని మకుటం లేని మహరాజులా వెలుగొందారు. భాగస్తుల కొరకు రెండు వ్యాపార సముదాయాలు నిర్మించి తాను మాత్రం అద్దె షాపులోనే వ్యాపారం నిర్వహించుకున్న ఆదర్శమూర్తి.

చిన్న మొక్కను నాటి దాని అభివృద్ధికి శ్రమించి, ఫలాలు సిద్ధించుకుని, కొడుకులం చేతికొచ్చేనాటికి సుఖవంతమైన జీవితం గడపాల్సిన సమయాన ఉగాది పర్వదినాన రాక్షస నామ సంవత్సర రక్కసి మొదటి రోజునే ఆ మహనీయుని కబళించి వేసింది.

"నీ పుట్టుక సాధారణంగా ఉండవచ్చునేమో గాని
నీ మరణం గొప్పగా ఉండాలి."

నాన్నగారి మరణవార్త వారి మిత్రులు, శ్రేయోభిలాషులు, వ్యాపార వర్గాలు ఖాతాదారులను దిగ్భ్రాంతికి గురి చేసింది. సామాన్యులను సైతం ఒకింత వేదనకు గురి చేసింది.

నాన్నగారి పార్థీవ దేహాన్ని కుల, మత, వర్గ విభేదాలు లేకుండా సుమారు నాలుగు వందల మంది జనం స్మశాన వాటిక వరకు మోసుకుంటూ వెళ్ళి ఘన నివాళులు అర్పించి వారికి తుది వీడ్కోలు పలికారు.

శ్రీ వీర రాఘవులు గారు దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు.



# నాన్నగారితో నేను

నా విద్యాభ్యాసం సెయింట్ జోసెఫ్ హైస్కూలు, రాజేంద్రనగర్ స్కూలు నందు చేయించారు. నేను 4వ తరగతి పాసైన తర్వాత మా హెడ్‌మాస్టర్ శ్రీ కొత్తా రంగారావు గారితో చెప్పి సెలవు దినాలలో ప్రత్యేకంగా నాకు 5వ తరగతి బోధించి మేడేపల్లి గ్రామంలో పరీక్ష వ్రాయించి ఉత్తీర్ణులైనట్లుగా సర్టిఫికెట్ ఇప్పించారు. తర్వాత నాన్నగారు నన్ను మల్టిపర్పస్ స్కూలులో చేర్పించిన జ్ఞాపకం. నేను 6వ తరగతి చదువుచున్నప్పుడు నాకు "ఫెవర్ లూబా" రిస్ట్‌వాచ్ కొనివ్వడం గర్వంగా చెప్పకున్న జ్ఞాపకం, స్నేహితులతో కలిసి స్కూలుకి వెళ్ళకుండా తప్పించుక తిరిగినపుడు ఊరంతా సైకిల్‌పై తిరిగి వెదికి పట్టుకుని మమ్ములను గదిలో బంధించి భోజనం పెట్టకుండా శిక్షించినపుడు ఏడ్చిన జ్ఞాపకం.

నేను 9వ తరగతి చదువుచున్నప్పుడు స్కూలు తరపున ఉత్తర భారతదేశానికి ఎక్స్‌కర్షన్‌కు పంపారు. కాశ్మీరు వరకు వెళ్ళి 15 రోజుల తర్వాత తిరిగి వచ్చాము. ఈ సమయంలోనే నాకు అంబర్ సైకిల్ అన్ని ఫిటింగ్స్‌తో ఇప్పిస్తే దాన్ని చూసుకుని నేను ఎంతో మురిసిపోయిన జ్ఞాపకం,

నాన్నగారికి నాపై ఉన్న ప్రేమ, వాత్సల్యం అర్థమయ్యే నాటికి శాంతినగర్ స్కూలులో నేను SSC చదువుచుండగానే నాకు వివాహం జరిపించారు. అప్పుడు నా వయస్సు 16సం॥.

వివాహం అయిన తర్వాత 1969లో శ్రీ వీర రాఘవులు గారి వద్ద వ్యాపార విలువలు నేర్పించి ఆ తర్వాత తన వద్దే ఉంచుకుని కుటుంబ విలువలతోపాటు సమాజ పోకడలు నేర్చుకునే మహద్భాగ్యాన్ని నాకు కలుగ జేశారు. వారు పెద్దలతో మాట్లాడుతున్నప్పుడు ప్రక్కన కూర్చోబెట్టుకుని ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు నేర్పించారు. నాన్నగారు నన్ను ఎప్పుడూ బలహీనపడనివ్వక పోయేవారు. ఎవరి బలాలు, బలహీనతలు వారికుంటాయి, బలహీనతలకన్నా బలం ఎక్కువ ఉన్నవారు తప్పకుండా గొప్పవారవుతారని చెపుతూ ఎప్పుడూ నాలో మనోధైర్యాన్ని నింపేవారు.

# స్ఫూర్తి

సమాజంలో ఉత్తమునిగా గుర్తించబడాలంటే సమాజం పట్ల, కుటుంబం పట్ల ఉన్నతమైన వ్యక్తిత్వం గల వారిగా సమాజంలో భాగస్వామిగా జీవించాలి. అప్పుడే సమాజం నిన్ను ఉత్తములుగా గుర్తిస్తుంది.

నాన్నగారు చనిపోయిన రోజున మేమందరం విలపిస్తుంటే కమాన్ బజార్‌లో రావిచెట్టు క్రింద పండ్లు అమ్ముకునే వెంకమ్మ అనే ఓ సాధారణ మహిళ చెప్పిన మాటలు నాకు ఇప్పటికి గుర్తున్నాయి.

ఈ భూమి మీద పుట్టిన ప్రతి జీవి వెళ్ళిపోవాల్సిందేనని,
రాముడు, కృష్ణుడు, గాంధి, నెహ్రూ లాంటి వారే కీర్తిశేషులయ్యారని,
అలాగే చెట్టునుండి మనం మంచి ఫలాన్ని మాత్రమే కోసుకుంటామని,
దేవుడు కూడా మంచివారినే తొందరగా తీసుకెళతాడని చెప్పిందావిడ.
మా ఐదుగురు అన్నదమ్ములు పంచపాండవుల్లాగా కలిసి ఉండాలని,
మన చేతివ్రేళ్ళు ఐదు సమానంగా ఉండనట్లే
ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువని ఎంచరాదని,
ఆస్తుల కోసం గొడవలు పడి, తగాదాలతో విడిపోకుండా,
ఉన్నంతకాలం కలిసి జీవించాలని
ఓదారుస్తూ ఆమె చెప్పిన మాటలు నా హృదయంలో చిరస్థాయిగా నిలిచాయి.



శ్రీ గుడ్ల వీర రాఘవులు గారు



శ్రీ గుర్రం కాంతయ్య గారు

# ముగింపు

ఆగిపోని కాలంలో వారు ఆగిపోయేవరకు
వెలుగారని కన్నుల్లో చీకటి చేరేవరకు
వారు అనుసరించిన మార్గం స్ఫూర్తిదాయకం

నాన్నగారి తదనంతరం మా వ్యాపారంలో శ్రీ వీర రాఘవులు గారి చేయూత వెలకట్టలేనిది. ఇంటి వ్యవహారాలలో మా చిన్న పెద్దనాన్న శ్రీ గుర్రం కాంతయ్య గారి తోడ్పాటు మరువలేనిది.

ఐదుగురు అన్నదమ్ములం పంచ పాండవుల్లాగా, ఐకమత్యంగా జీవిస్తూ వారు నేర్పిన విలువలు పాటిస్తూ కుటుంబం మరియు వ్యాపార విషయాలలో మాకు మేముగా అభివృద్ధి పరుచుకుంటూ వస్తున్నాము.

వారి పేరుతోనే వ్యాపారాలు సమిష్టిగా నిర్వహిస్తూ వారి కీర్తిని తర తరాలకు నిలబెట్టేలా మమ్మల్ని మేము తీర్చిదిద్దుకుంటున్నాము.

ఇప్పుడు మూడవ తరం వంశాంకురాలు కూడా అవే విలువలను పాటిస్తూ భగవంతుని కృప మరియు నాన్నగారి ఆశీస్సులతో వ్యాపార సంస్థలను శాఖోప శాఖలుగా విస్తరింపజేస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా కొన్నివేల కుటుంబాలకు భరోసా ఇస్తున్నారు.

నాన్నగారు కీర్తిశేషులై 46 సంవత్సరాలు గడిచినా మాకు వారు ప్రాతః స్మరణీయులు. వారి ఆశీస్సులతో, మా కుటుంబం సక్రమ మార్గంలో కొనసాగుతుందని నా ప్రగాఢ విశ్వాసం. వారు నడిచిన బాట భావి తరాల వారికి దారి దీపంలా ఉపయోగపడాలని కుటుంబ సభ్యులు అందరూ వారి చరిత్రను చదవాలని, వారి విశిష్టత ఖమ్మం జిల్లా అంతటా శత వసంతాలు గుర్తుంచుకునేలా కుటుంబసభ్యులందరు జీవించాలని,

### గుర్రం వారి వంశానికి మూల పురుషుడైన

కీ॥శే॥ శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు గారిని గుర్తుంచుకుంటారని మనసారా కోరుకుంటూ కాలచక్రం విరామం లేకుండా పరుగులు తీస్తూనే ఉంటుంది, ఆ దారిలో ఎన్నో గుర్తులను ముద్రించి వెళుతూనే ఉంటుంది, ఆ గుర్తులు మనకు స్ఫూర్తిని అందించి ముందుకు వెళ్ళమని ప్రోత్సహిస్తాయి వేదన, రోదన, అలజడి, ఆక్రందన వల్ల ముందుకు అడుగు వేసే ఘడియలో నిరాశపడనూ వచ్చు. వారి మహత్తరమైన శక్తి మనసులోనూ, హృదయంలోనూ, జ్వాలగా ప్రకాశిస్తూనే ఉంటుంది.

ఆ వెలుగులో సమస్యల చీకట్ల వలయాలు అదృశ్యం అయ్యేట్లుగా మలచుకోవాలని కోరుకుంటూ.

నాన్నగారిని స్మరిస్తూ నాకు గుర్తుకు వచ్చిన జ్ఞాపకాలకు, స్మృతులకు అక్షర రూపాన్నిస్తూ..

ప్రేమతో నాన్నకు అంకితం

- మీ గుర్రం నరసింహ్వారావు

# ఆ తర్వాత

నాన్నగారు మరిణించే నాటికి సోదరులు అశోక్ కుమార్, ఉమా మహేశ్వరరావు, చెల్లెలు పద్మావతి దేవి చిన్న పిల్లలు, అన్నయ్య రామారావు గారు పూర్తిస్థాయిలో వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనేవారు కాదు.

నాకు, సోదరుడు ప్రసాదరావుకి చదువు అంతగా అబ్బనందున 10వ తరగతి వరకు మాత్రమే చదువుకుని వ్యాపారంలో నాన్నగారికి చేదోడు వాదోడుగా ఉన్నప్పటి అనుభవం మమ్ములిద్దరిని పూర్తిస్థాయిలో వ్యాపార బాధ్యతలు స్వీకరించుటకు తోడ్పడినది.

అదే సంవత్సరం మేమందరం సమిష్టిగా చెల్లెలి వివాహం జరిపించాము. తమ్ముడు అశోక్‌కుమార్‌ని వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంచుకుని, 1976వ సంవత్సరంలో అతనికి మా మామయ్య గారు శ్రీ పోలా నాగయ్య గారి తృతీయ కుమార్తె శశికళను ఇచ్చి వివాహం జరిపించాము.

చిన్న తమ్ముడు ఉమా మహేశ్వరరావుని పుణెలో MBA చదివించాము. ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణులై తిరిగివచ్చిన తర్వాత అతనికి 1986వ సంవత్సరంలో చీరాల వాస్తవ్యులు శ్రీ ఆలపాటి చిన్న వెంకటస్వామి గారి పంచమ కుమార్తె అయిన లక్ష్మి రాధిక ను ఇచ్చి వివాహం జరిపించాము. తర్వాత అతను కూడా వ్యాపారంలోకి వచ్చాడు.

# శాఖల విస్తరణ

నాన్నగారి తదనంతరం నేను, సోదరులు ప్రసాదరావు, అశోక్‌కుమార్ లు కలిసి అదే విలువలు పాటిస్తూ శ్రీ వీర రాఘవులు గారి సహకారంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేయుటలో మా వంతు పాత్ర పోషించాము. ఆ వృద్ధిలో భాగంగా

1977 సం॥లో గుర్రం వెంకటేశ్వర్లు సన్స్ & కో సంస్థను గ్వాలియర్ సూటింగ్ మరియు ఆర్ మిలాన్ సూరత్ శారీస్ తో ప్రత్యేక షోరూం ప్రారంభించాము.

1978 సం॥లో గుర్రం వెంకటేశ్వర్లు & కో లో భాగంగానే "సుధా శారీ సెంటర్" అనే పేరుతో ప్రత్యేక చీరల షోరూం ప్రారంభించాము.

1980 సం॥లో "స్వాతి సిల్క్స" పేరుతో ప్రత్యేక పట్టు చీరల షోరూం ప్రారంభించాము.

1985 సం॥లో కమాన్‌బజార్‌లో "సింధూర్" సాంప్రదాయపు చీరల నిధి పేరుతో ప్రత్యేక చీరల షోరూం ప్రారంభించాము.

1985 సం॥లో శ్రీ వెంకటేశ్వర పారా బాయిల్డ్ రైస్ పేరుతో మా చిన్న పెద్దనాన్న గారు శ్రీ గుర్రం కాంతయ్య గారు, శ్రీ గుడ్ల వీర రాఘవులు గారు, శ్రీ బెందడి లింగం గారి కుమారులు మరియు మా మామగారు శ్రీ కొదుమూరి జగన్నాధం గార్లతో కలిసి ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియాలో మిల్లు ప్రారంభించాము.

1950 సం॥ మొదలుకుని 1985 వరకు ఏర్పాటై మనుగడలో ఉన్న వ్యాపార శాఖలన్నింటిని ఒకే గొడుగు క్రిందకు తీసుకవస్తూ 1991 జనవరి లో "సృష్టి" షోరూం ప్రారంభానికి ముందు

గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్‌టైల్స్ ప్రై॥ లి॥ సంస్థను స్థాపించి దానిలో అప్పటికే కొనసాగుచున్న షాపులను డివిజన్లుగా మార్చి విలీనం చేయడం జరిగింది. ఆ తర్వాత ప్రారంభించిన అన్ని షాపులను ఈ సంస్థలోని డివిజన్లు గానే కొనసాగిస్తున్నాము.

1991 సం॥లో "సృష్టి" పరిపూర్ణ వస్త్రాలయం పేరుతో ఖమ్మం కమాన్‌బజార్ లో ప్రప్రధమంగా పెద్ద షోరూం ప్రారంభించాము.

2002 సం॥లో కమాన్‌బజార్‌లో ఒక బిల్డింగ్ కొనుగోలు చేసి "గుర్రం బ్రదర్స్" ఆలయం ఆఫ్ టెక్స్‌టైల్స్ పేరుతో మరోపెద్ద షోరూం ప్రారంభించాము. దీనిని మరింత విస్తరిస్తూ 2011 సం॥లో మెన్స్‌వేర్, లేడీస్ వేర్ ప్రారంభిస్తూ లిఫ్ట్ సౌకర్యం అందుబాటులోకి తెచ్చాము.

2014 సం॥లో కస్బాబజార్‌లో ఖమ్మం జిల్లాలో మొట్టమొదటి మాల్ "జివి మాల్" షాప్ & సెలబ్రేట్ పేరుతో అన్ని హంగులతో అధునాతనంగా నిర్మించి ప్రారంభించాము.

2018 సం॥లో "ఏలూరు"లో సోదరుడు ప్రసాదరావు అల్లుడుగారి భాగస్వామ్యంతో "జివి మాల్" షాప్ & సెలబ్రేట్ పేరుతో ప్రారంభించాము.

2018 సం॥లో ఖమ్మం వైరారోడ్ ప్రాంతంలో "ఉమెని" పేరుతో ప్రత్యేక లేడీస్ వేర్ షోరూం ప్రారంభించాము.

2020 సం॥లో కొత్తగూడెంలో "జివి మాల్" షాప్ & సెలబ్రేట్ పేరుతో ప్రారంభించాము.

2020 మరలా ఇదే సం॥లో మిర్యాలగూడెం లో "జివి మాల్" షాప్ & సెలబ్రేట్ పేరుతో ప్రారంభించాము.

2021 సం॥లో రాజమహేంద్రవరం (రాజమండ్రి) లో జి.వి. మాల్ షాప్ & సెలబ్రేట్ పేరుతో ఫ్రాంచైజ్ స్టోర్ ప్రారంభించాము.

ఇదే సంవత్సరం ఏలూరి వారి భాగస్వాములతోనే జి.వి. మాల్ షాప్ & సెలబ్రేట్ పేరుతో గుడివాడలో మరోస్టోర్ ప్రారంభించాము.

అదేవిధంగా జి.మెన్ పేరుతో తిరువూరులో పూర్తి మెన్స్‌వేర్ స్టోర్‌ను ప్రారంభించడం జరిగింది. 2022 సం॥లో అన్ని షోరూంలకు ఒకేచోట నుండి సరుకు సప్లయి చేసే విధంగా అన్ని సౌకర్యాలు, హంగులతో నిర్మించిన వేర్‌హౌజ్‌ను ప్రారంభించాము.

ఆకృతి - కలల రూపం పేరుతో రెండు తెలుగు రాష్ట్రాలలో 25 పైగా ఫ్రాంచైజ్ స్టోర్స్‌కు లేడీస్ వేర్ మేము సప్లయి చేస్తున్నాము.

ఇవికాక మేము ట్విల్స్ - మెన్స్‌వేర్, మాన్యవర్ - ఎథినిక్‌వేర్, స్వయంవర్ - ఎథినిక్‌వేర్ లను ఫ్రాంచైజ్ స్టోర్స్‌గా వ్యాపారం కొనసాగిస్తున్నాము.

మా ఐదుగురు అన్నదమ్ముల కుటుంబాలు ఉమ్మడిగా ఒకేచోట నివసించే విధంగా 2007 సం॥లో మామిళ్ళగూడెం ప్రాంతంలో 5 అంతస్తుల విశాలమైన భవనాన్ని నివాసానికి నిర్మించుకున్నాము.

ఈ పుస్తకం వ్రాసేనాటికి జి.వి. మాల్ షాప్ & సెలబ్రేట్ - జంగారెడ్డిగూడెం
జి.వి. మాల్ షాప్ & సెలబ్రేట్ - సత్తుపల్లి

స్టోర్‌లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే 3 ఎకరాల సువిశాల ప్రాంగణంలో మరో నూతన వేర్‌హౌస్ నిర్మాణం చేపట్టుటకు వరంగల్ రోడ్‌లో స్థలం కొనుగోలు చేయడం జరిగినది.


సృష్టి
a heaven of cloths
కళ్యాణం
కలెక్షన్స్
70
Festival Collections
కారు
కారు

సృష్టి




గుర్రం బ్రదర్స్




సింధూర్





జివి మాల్, ఖమ్మం




జివి మాల్, ఏలూరు




జివి మాల్, కొత్తగూడెం




జివి మాల్, మిర్యాలగూడెం



## ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్



ఐదుగురు అన్నదమ్ములు ఫోటో



# వంశ వృక్షం

మా వంశ మూల పురుషుడు, మా తండ్రిగారైన
శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు - లీలావతి దంపతులకు మేము ఆరుగురం సంతానం. మేము, మా భార్యాపిల్లలు, మనవలు, మనవరాండ్రు లతో ఎదిగిన మా వంశ వృక్షాన్ని ఈ క్రింద తెలియపరుస్తున్నాను.

దానికంటే ముందు మా ఐదుగురు అన్నదమ్ముల జీవిత విశేషాలు, వ్యాపారాభివృద్ధిలో వారి వంతు కృషి మొదలగు అంశాలను విపులంగా వివరించ దలచుకున్నాను.

## ప్రథమ కుమారుడు



కీ॥శే॥ శ్రీ గుర్రం రామారావు గారు

14.10.1950 - 27.7.1991

## పరోపకారి రామన్న:

గొడ్డొచ్చిన వేళ, బిడ్డొచ్చిన వేళ అని అంటారు. మా అన్నయ్య గారు పుట్టిన తర్వాత నాన్నగారి వ్యాపారం బాగా వృద్ధి చెందింది. ప్రథమ సంతానం అయినందువల్ల అల్లారు ముద్దుగా పెంచారు. వారికి ఒక్క చదువే అబ్బలేదు కాని అతనిలో ఎన్నో సుగుణాలు ఉన్నవి. పరుల సేవలో పరమానందాన్ని పొందేవారు. అంతేగాక భక్తిపరులు కూడాను.

యుక్త వయస్సులోనే కమాన్‌బజార్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటి సభ్యునిగా, దేవాలయ అభివృద్ధికి తోడ్పడ్డారు. లయన్స్‌క్లబ్ మెంబరుగా సమాజ సేవలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా యవజన నాయకుడు జలగం ప్రసాద్ గారి మన్ననలు పొందారు.

వారి చేతితో ఎవరు ఏ వ్యాపారాన్ని ప్రారంభించినా అది దిగ్విజయంగా కొనసాగేది. ఎవరికైనా ప్రభుత్వపరమైన సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో ధైర్యంగా మాట్లాడేవారు. గవర్నమెంటు రూల్స్ అందరూ తప్పక పాటించాలని ఎప్పుడూ చెబుతుండేవారు. మేము ఎప్పుడైనా ప్రభుత్వ సెలవు దినాలలో షాపు వెనుకమార్గం ద్వారా తెరిస్తే సంబంధిత లేబర్ ఆఫీసర్‌కు తనే ఫోన్ చేయించి కేసు వ్రాయించేవారు.

ఎన్.టి.రామారావు గారి సినిమాలు ఎక్కువగా చూసేవారు. అంతేగాక ఎన్‌టిఆర్ అభిమాన సంఘంలో ఉత్సాహంగా పాల్గొనేవారు.


ఆయనకు ఏరోజు కూడా సంపాదించాలనే కోరిక ఉండేది కాదు. తన ఆరోగ్యం గురించి కూడా అంతగా పట్టించుకునేవారు కాదు. తను 25సం॥ వయస్సులోనే షుగర్ వ్యాధి భారినపడ్డారు.

ఆయనకు అదృష్టం కొద్ది అర్థం చేసుకుని, ప్రేమగా చూసుకునే ఇల్లాలు వీరలక్ష్మి గారు భార్యగా లభించారు. భర్త ఆరోగ్యం పట్ల ఎన్ని జాగ్రత్తలు పాటించమని చెప్పినా వారు పాటించేవారు కారు. 41సం॥ చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలతో 1991 సం॥లో స్వర్గస్తులయ్యారు. వారు జీవించినంత కాలం పరులకొరకే జీవించారు.

అన్నయ్య మరణం వదిన గారిని మానసికంగా కృంగదీసింది. అయినా మా కుటుంబాన్ని నడిపించే బాధ్యతలు తను తీసుకున్నారు. తన పిల్లలకు, మా పిల్లలకు, అంతేగాక మాకు కూడా ఒక తల్లిలా అందరిని సంరక్షిస్తూ, కుటుంబాన్ని సక్రమ మార్గంలో నడిపిస్తూ అందరూ ప్రేమాభిమానాలతో జీవించేలా చూసుకుంటున్నారు.

మా నాన్నగారి తర్వాత మా వదినగారు మాకు దేవుడిచ్చిన వరం.

# ద్వితీయ కుమారుడు



## శ్రీ గుర్రం నరసింహ్వారావు

నేను 1969 సం॥లో శ్రీ గుడ్ల వీర రాఘవులు గారి వద్ద వ్యాపార విలువలు నేర్చుకుని 1975 సం॥ వరకు నాన్నగారి వద్ద వ్యాపారాన్ని నేర్చుకున్నాను. నాన్నగారి తదనంతరం శ్రీ వీర రాఘవులు గారి కుటుంబం మరియు మా చిన్న పెద్దనాన్న శ్రీ కాంతయ్య గారి సహకారంతో వ్యాపారాన్ని నిర్వహించుటలో నావంతు పాత్ర పోషించాను. తర్వాత సోదరులు ఒక్కొక్కరుగా వచ్చి వ్యాపార నిర్వహణలో పాలుపంచుకున్నారు. 1969 నుండి 1985 వరకు గుర్రం వెంకటేశ్వర్లు & కో లో, 1985 నుండి 2000 సం॥ వరకు సింధూర్ లో వ్యాపార కార్యకలాపాలు కొనసాగించాను. 2002 సం॥ నుండి నేటి వరకు గుర్రం బ్రదర్స్ నిర్వహణలో కొనసాగుచున్నాను.

# తృతీయ కుమారుడు




## కీ॥శే॥ గుర్రం ప్రసాదరావు

8/6/1957 - 15/2/2022

సోదరుడు ప్రసాదరావు 1973సం॥లో నాతోపాటు వ్యాపారంలోకి వచ్చి నాన్నగారికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. వ్యాపారంలో ఎప్పుడూ ఉత్సాహంగా పనిచేసేవాడు. వస్త్రాలను ఖరీదు చేయడంలో మంచి నేర్పరి. వ్యక్తిగతంగా చాలా ధైర్యవంతుడు. జ్ఞాపక శక్తి మెండుగా గలవాడు. మంచి మాటకారి కూడాను. నాన్నగారి లాగే ప్రతి కస్టమర్‌ను ఇంటి పేరుతో సహా పలకరించ గలడు. అందరితో స్నేహ సంబంధాలు కలిగి వ్యాపారాన్ని కొనసాగించుటలో తన పందా కొనసాగించాడు.

1991 సం॥లో సృష్టి షోరూం ప్రారంభించిన తర్వాత దాని నిర్వహణా బాధ్యతలు తాను తీసుకున్నాడు. దానిని బాగా అభివృద్ధి పరుస్తూ మా కుటుంబానికి స్థిరాస్థులు కొనడంలో ప్రధాన పాత్ర పోషించాడు. తర్వాత 2014 సం॥లో జి.వి. మాల్ ప్రారంభించిన తర్వాత సృష్టి షోరూంలో ఉన్నటువంటి స్టాకును, ఉద్యోగులను జి.వి. మాల్‌కు తీసుకోవడం జరిగింది. అప్పటినుండి తాను జి.వి. మాల్ లో కొనసాగుచూ మంచితనానికి మారుపేరుగా, అందరికీ ప్రసాదన్నగా, దేవుడన్నగా అందరి హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించుకొని అనారోగ్యంతో ది. 15-2-2022 తేదీన స్వర్గస్తులయ్యారు.

# చతుర్థ కుమారుడు




## శ్రీ గుర్రం అశోక్ కుమార్

ఇతను నాన్నగారి తదనంతరం, అతని వివాహానంతరం 1977 సం॥లో వ్యాపారం లోకి వచ్చాడు. చాలా క్రమశిక్షణ గల వ్యక్తి. నేను, సోదరుడు ప్రసాదరావు ఖరీదుకు వెళ్లినపుడు షాపును చక్కగా నిర్వహించేవాడు.

లెక్కలు చూసుకొనుటలో చాలా శ్రద్ధ వహించేవాడు. అన్ని విషయాలు సకాలంలో పూర్తవుటకు సమయపాలన పాటిస్తాడు. మా కుటుంబ ఆర్థిక వ్యవహారాలు చక్కగా నిర్వహిస్తాడు. పిల్లలందరిని క్రమశిక్షణతో పెంచడానికి బాగా చొరవ చూపిస్తాడు. 2000 సం॥ నుండి సింధూర్ నిర్వహణ బాధ్యతలలో కొనసాగుచున్నారు.

# పంచమ కుమారుడు



## శ్రీ గుర్రం ఉమా మహేశ్వరరావు

సోదరుడు ఉమా మహేశ్వరరావు మా కుటుంబంలో ఉన్నత చదువులు చదువుకున్న మొదటి వ్యక్తి. అతని వివాహానంతరం 1986 సం॥లో పారాబాయిల్డ్ రైస్‌మిల్లు బాధ్యతలు అప్పజెప్పడం ద్వారా తను వ్యాపారం లోకి ప్రవేశించాడు.

అనతికాలంలోనే రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్ సెక్రటరీగా, తర్వాత ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీగా సేవలందించి సంఘంలో మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు.

1991 సం॥ నుండి గుర్రం వెంకటేశ్వర్లు టెక్స్‌టైల్స్ ప్రై॥ లి॥ మేనేజింగ్ డైరెక్టర్‌గా సమర్ధవంతంగా నిర్వహిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాడు. భద్రాద్రి కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి॥ డైరెక్టర్‌గా, శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీగా ఇతర అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. అతను వ్యాపార బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి మా వ్యాపారంలో వేగం పెరగడమేగాకుండా అంతే వేగంగా వ్యాపార శాఖలు పెరిగాయి. అతను మా కుటుంబానికి నాయకత్వం వహించి మమ్ములను, మా పిల్లలను చూపుడు వేలులా సరైనబాటలో నడిపిస్తున్నాడు.

ముందుగా చెప్పినట్లు మా కుటుంబంలోని ప్రతి ఒక్కరి పేర్లు, వివరాలు, వారి కార్యకలాపాలు, పుట్టిన తేదీలు, వివాహ తేదీలు అన్నీ ఈక్రింద వివరించ దలచుకున్నాను.

కీ॥శే॥ శ్రీ గుర్రం వెంకటేశ్వర్లు - లీలావతి దంపతులు

మా వంశ మూల పురుషుడు - మా తల్లిదండ్రులు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 20/9/1926 | - | 1934 |
| వివాహం | : | | - | 1942 |
| నిర్యాణం | : | 12/4/1975 | - | 1997 |

వీరి సంతానంగా ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె, వారి పిల్లలు, మనవలు, మనవరాండ్రు ల వివరాలు ఈక్రింది విధంగా -



గుర్రం వీరలక్ష్మి గారి ఫ్యామిలి

### కీ॥శే॥ గుర్రం రామారావు - శ్రీమతి వీరలక్ష్మి దంపతులు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 14/10/1950 | - | 23/9/1955 |
| వివాహం | : | 18/6/1966 | | |
| నిర్యాణం | : | 12/7/1991 | | |

### వీరికి సంతానం

కుమార్తె: నాళ్ళ సుధారాణి - కిషోర్ దంపతులు

వీరు బెంగుళూరులో నివాసం ఉంటున్నారు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 12/6/1973 | - | 31/1/1965 |
| వివాహం | : | 28/6/1991 | | |
| మనవరాలు | : | కాంక్షిత - 17/12/2013 | | |

ప్రథమ కుమారుడు : గుర్రం వెంకటేష్ బాబు - సునీత దంపతులు

వీరు ఇంజనీరింగ్ వృత్తిలో కొనసాగుచున్నారు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 28/5/1976 | - | 15/9/1980 |
| వివాహం | : | 28/5/2005 | | |
| మనవరాలు | : | సహస్ర - 3/12/2006 | | |

ద్వితీయ కుమారుడు : గుర్రం సతీష్ కుమార్ - వనజ దంపతులు

వీరు GVT(P) Ltd.లో మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్ విభాగాన్ని నిర్వహిస్తారు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 20/8/1977 | - | 10/4/1982 |
| వివాహం | : | 25/2/2007 | | |
| మనవడు | : | రాము - 5/6/2008 | | |
| మనవడు | : | అర్జున్ - 26/1/2012 | | |



గుర్రం నర్సింహ్వారావు గారి ఫ్యామిలి

శ్రీ గుర్రం నరసింహ్వారావు - లక్ష్మి దంపతులు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 21/5/1954 | - | 15/7/1957 |
| వివాహం | : | 6/6/1969 | | |

వీరికి సంతానంగా

ప్రథమ కుమారుడు : గుర్రం మురళికృష్ణ - లక్ష్మి మాధురి దంపతులు

వీరు GVT(P) Ltd. లో లేడీస్‌వేర్, ఆకృతి విభాగాలను నిర్వహిస్తారు.

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 30/6/1972 | - | 27/7/1979 |
| వివాహం | : | 10/2/2000 | | |
| మనవరాలు | : | లక్ష్మివేద - 4/9/2004 | | |

ద్వితీయ కుమారుడు : గుర్రం మల్లిఖార్జున్ - వాణి ప్రియంవద దంపతులు

వీరు అమెరికా లో నివాసం ఉంటున్నారు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 27/7/1973 | - | 4/12/1979 |
| వివాహం | : | 27/8/2002 | | |
| మనవడు | : | అఖిల్ | - | 29/9/2006 |
| మనవరాలు | : | ఆద్య | - | 4/10/2011 |

కుమార్తె: కురువెళ్ళ మాధవి - ప్రవీణ్ కుమార్ దంపతులు

వీరు GVT(P) Ltd. లో లింగరీ వేర్ విభాగాన్ని నిర్వహిస్తారు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 9/10/1977 | - | 22/6/1974 |
| వివాహం | : | 13/8/1998 | | |
| మనవడు | : | శ్రీకర్ | - | 26/11/1999 |
| మనవరాలు | : | సాత్విక | - | 20/7/2003 |



గుర్రం ప్రసాదరావు గారి ఫ్యామిలి

## కీ॥శే॥ గుర్రం ప్రసాదరావు - సుమతి (అనసూయ) దంపతులు

జననం : 8/6/1957 7/9/1959

వివాహం : 15/5/1974

నిర్యాణం : 15/2/2022

వీరికి సంతానంగా

ప్రథమ కుమారుడు : గుర్రం శ్రీనివాసరావు - సీతామహాలక్ష్మి దంపతులు

వీరు GVT(P) Ltd. లో చీరల విభాగాన్ని నిర్వహిస్తారు

ఇతనికి మాచెల్లెలు పద్మావతిదేవి కుమార్తెను ఇచ్చి వివాహం జరిపాము

జననం : 3/11/1975 - 6/9/1977

వివాహం : 4/3/1999

మనవడు : విశిష్టసాయి - (19/12/2000 - 30/10/2012)

మనవరాలు : లీలా లాస్య - 8/12/2004

కుమార్తె: కొత్తమాసు పావని - సత్యనారాయణ దంపతులు

వీరు "జివి మాల్" ఏలూరు లో భాగస్తులుగా ఉన్నారు

జననం : 9/8/1978 - 8/12/2004

వివాహం : 13/8/1998

మనవడు : తనుష్ - 25/1/2003

మనవరాలు : శ్రీనిధి - 30/12/2003

ద్వితీయ కుమారుడు : గుర్రం నరెందర్ కుమార్ - చైతన్య దంపతులు

వీరు జివి మాల్ కొత్తగూడెం బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

జననం : 17/12/1980 - 1/3/1991

వివాహం : 25/8/2013

మనవడు : విశిష్ట ప్రసాద్ - 1/11/2014

మనవడు : ధృవ్ - 15/12/2018



గుర్రం అశోక్ కుమార్ గారి ఫ్యామిలి

## శ్రీ గుర్రం అశోక్ కుమార్ - శశికళ దంపతులు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 29/10/1960 | - | 27/6/1962 |
| వివాహం | : | 10/12/1976 | | |

### వీరికి సంతానంగా

ప్రథమ కుమారుడు : గుర్రం సునీల్ కుమార్ - ప్రీతి దంపతులు

వీరిరువురు వైద్యవృత్తిలో కొనసాగుచున్నారు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 19/5/1979 | - | 4/6/1982 |
| వివాహం | : | 16/2/2008 | | |
| మనవరాలు | : | నిష్ట సంతోషి | - | 22/3/2011 |
| మనవరాలు | : | నిత్య సంతోషి | - | 13/1/2014 |

కుమార్తె: ఉల్లి సుజాత - వెంకట లక్ష్మీనారాయణ గుప్తా దంపతులు

వీరు అమెరికాలో నివాసం ఉంటున్నారు.

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 31/5/1981 | - | 20/2/1977 |
| వివాహం | : | 20/11/2004 | | |
| మనవడు | : | విష్ణు | - | 3/2/2007 |
| మనవరాలు | : | నందిని | - | 7/2/2009 |

ద్వితీయ కుమారుడు : గుర్రం సుమన్‌కుమార్ - అనూష దంపతులు

వీరు GVT(P) Ltd. లో IT విభాగం నిర్వహిస్తున్నారు.

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 18/4/1983 | - | 23/7/1989 |
| వివాహం | : | 22/5/2011 | | |
| మనవరాలు | : | యుక్త | - | 2/7/2013 |
| మనవడు | : | యువాన్ సంతోష్ | - | 22/10/2016 |



గుర్రం ఉమా మహేశ్వరరావు గారి ఫ్యామిలి

శ్రీ గుర్రం ఉమా మహేశ్వరరావు - లక్ష్మి రాధిక దంపతులు

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 5/3/1963 | - | 5/2/1971 |
| వివాహం | : | 24/12/1986 | | |

వీరికి సంతానంగా

ప్రథమ కుమారుడు : గుర్రం అంకిత్ కుమార్ - సుప్రియ దంపతులు

వీరు GVT(P) Ltd. లో IT విభాగం నిర్వహిస్తున్నారు.

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 20/9/1989 | - | 11/5/1991 |
| వివాహం | : | 5/2/2015 | | |
| మనవరాలు | : | ఆన్య | - | 8/11/2017 |

ద్వితీయ కుమారుడు : గుర్రం రేవంత్‌సాయి - ఊర్మిళ దంపతులు

వీరు GVT(P) Ltd. లో IT విభాగం నిర్వహిస్తున్నారు.

| | | | | |
|---|---|---|---|---|
| జననం | : | 8/9/1992 | - | 13/1/1996 |
| వివాహం | : | 21/6/2019 | | |



చెరుకూరి పద్మావతి దేవి గారి ఫ్యామిలి

కీ॥శే॥ చెరుకూరి పద్మావతి దేవి - శ్రీ వెంకట రామారావు దంపతులు

జననం : 5/3/1963 - 27/5/2012 - 1/11/1958

వివాహం : 4/6/1975

వీరికి సంతానంగా

ప్రథమ కుమార్తె : గుర్రం సీతామహాలక్ష్మి - శ్రీనివాసరావు దంపతులు

జననం : 4/9/1977 - 3/11/1975

వివాహం : 4/3/1999

సంతాన వివరాలు ముందు పేజిలో వివరించబడ్డాయి

కుమారుడు : చెరుకూరి వెంకట జనార్ధన్ - జ్యోతిక దంపతులు

వీరిరువురు గుర్రం బ్రదర్స్ నిర్వహణ బాద్యులుగా ఉన్నారు

జననం : 3/3/1981 - 7/6/1985

వివాహం : 19/12/2010

మనవడు : సాయినందన్ - 15/8/2013

మనవడు : సాయి దేవాన్ష్ - 6/3/2017

ద్వితీయ కుమార్తె : పొలిశెట్టి శ్వేత - సురేష్ దంపతులు

వీరు అమెరికాలో నివాసం ఉంటున్నారు

జననం : 30/10/1982 - 13/9/1977

వివాహం : 3/3/2006

మనవడు : శ్రేయస్ - 29/10/2008

మనవడు : శ్రీరాం - 18/12/2012

తృతీయ కుమార్తె : మద్దాలి స్వాతి - హరికృష్ణ దంపతులు

వీరు GV మాల్, మిర్యాలగూడ నిర్వహణ బాద్యతలు చూస్తున్నారు.

జననం : 30/10/1982 - 25/9/1978

వివాహం : 28/2/2008

మనవరాలు : చిన్మయి - 7/3/2011



మొత్తం ఆరు కుటుంబాల ఫ్యామిలి

# కలసి ఉంటే కలదు సుఖం

"కలసి ఉంటే కలదు సుఖం", "ఐకమత్యమే మహాబలం" అన్న సూక్తులను మేము మనసా, వాచా, కర్మణా నమ్మి సమిష్టి కుటుంబంగా జీవిస్తున్నాము. ఒకరికొకరం అండగా ఉంటూ కష్టసుఖాలలో పాలు పంచుకుంటూ, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటూ, ప్రత్యక్షంగా కొన్ని వేల మందికి జీవనోపాది కల్పిస్తూ, సిబ్బందిని కుటుంబసభ్యులుగా భావిస్తూ వారి ఆనందంలోనే మా అభివృద్ధి దాగి ఉందని గుర్తించి మెలుగు చున్నాము. భగవంతుడు మాకు ఇచ్చినదానిలో కొంత దానధర్మాలకు, సమాజ సేవకు, పేద పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడుచూ ఆనందాన్ని పొందుచున్నాము.

ఈ కుటుంబం ఇంత అభివృద్ధి చెందుతూ, ఆనందంగా జీవించుటకు ఆ భగవంతుని దయ, నాన్న గారి దివ్యాశీస్సులతో పాటు మా వదిన గారు శ్రీమతి వీరలక్ష్మి గారు, సోదరుడు ఉమా మహేశ్వరరావు ల మార్గనిర్దేశనం అనిర్వచనీయం. వారికి సహకరిస్తూ ఉమ్మడిగా కుటుంబ జీవనం కొనసాగిస్తున్న ప్రతి ఒక్క కుటుంబ సభ్యునికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరు మంచి పనులు చేస్తూ, మనకు చేతనైనంత ఇతరులకు ఇస్తూ, ఆ ఇవ్వడంలో ఆనందాన్ని, మనశ్శాంతిని ప్రతి ఒక్కరూ పొందాలని ఆశిస్తున్నాను.

# భావి తరాల వారికి విన్నపం

మీరు మా నాన్నగారి గురించి వ్రాసిన ఈ పుస్తకాన్ని చదివి మీ పిల్లలకు, పెద్దలు నడిచిన బాటను గురించి వివరిస్తూ, వారికి విద్యాబుద్ధులు నేర్పించడం ద్వారా ఉత్తమ పౌరులుగా, సంస్కారవంతులుగా, మంచి నడవడితో జీవించేలా చేస్తారని ఆశిస్తున్నాను.

# పరి సమాప్తి

మా నాన్నగారు స్వర్గస్తులయ్యే నాటికి నాకు కేవలం 21సం॥లు. నా పూర్వజన్మ సుకృతంగా ఆఖరి 5 సం॥లు వారి వద్ద శిక్షణ పొంది, వారి ప్రక్కనే ఉంటూ ఎన్నో మంచి విషయాలు నేర్చుకునే భాగ్యం నాకు కలిగింది. నేను ప్రత్యక్షంగా చూసినవి మరియు విన్నవి, అనుభవాల ద్వారా తెలుసుకున్నవి ఈ పుస్తకంలో పొందుపర్చాను. ఈ పుస్తకం మన కుటుంబానికి మార్గదర్శినిగా ఉంటుందని వ్రాశాను.

నేను రచయితను కాను. కేవలం అనుభవాలను మాత్రమే వ్రాశాను. ఇది వివరించుటలో ఏవైనా తప్పులుంటే, వివరించుటలో ఎవరినైనా విస్మరిస్తే, జ్ఞప్తికి రాని గురుతులు ఏవైనా మరచితే మన్నించగోరుచున్నాను.

ప్రేమతో..

- మీ గుర్రం నరసింహ్వారావు

# ధన్యోస్మి

GVT

Gurram Venkateshwarlu Textiles Pvt. Ltd.